## నేటి కందం-నేటికి అందం

క్రికెటు బ్యాడ్మింటనులను
చక్కగ సాధనము చేసి సత్ఫలితములన్
గ్రక్కున భారత్ పొందగ
తక్కిన దేశమ్ము లన్ని దండముల నిడెన్ !!

(మన భారత క్రీడా కారులు క్రికెట్ లోనూ,బ్యాడ్మింటన్ లోనూ అంతర్జాతీయ స్థాయిలో గెలుపొందడం భారతీయు లందరికీ గర్వకారణం.)

-రాధశ్రీ
సెల్:9494481210





# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com



## చురక

గడిలో దొరతనం
గత పాలన ఒప్పంటరు
నేడు దిల్లీ అధికారం
నియంత్రణ తప్పంటరు
రెండు నాల్కల ధోరణి
రాజకీయ దిగజారుడే
పరువంతా తీసుకొని
ప్రజల్లో మసకబారుడే

-వేల్పుల నారాయణ
9440433475





హైదరాబాద్ బుధవారం 18-11-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:93 పేజీలు:6 వెల: రూ.1/-


# ప్రపంచస్థాయి ప్రెసిషన్ ఇంజినీరింగ్ హబ్‌గా హైదరాబాద్: మంత్రి శ్రీధర్ బాబు




రంగారెడ్డి, నవంబర్ 17: ప్రపంచ స్థాయి ప్రెసిషన్ ఇంజినీరింగ్ హబ్‌గా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ఏరోస్పేస్ గ్లోబల్ సప్లై చైన్‌లో 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్‌కు గుర్తింపు తెస్తామని తెలిపారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కొత్తూరు తిగాపూర్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన జేఈహెచ్ ఏరోస్పేస్ సంస్థతోపాటు టూలింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రెసిషన్ ఇంజినీరింగ్‌కు కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు. తెలంగాణలో ఏరోస్పేస్ పరిశ్రమల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. ఈ సంస్థ ఏర్పాటుతో విమాన విడిభాగాల తయారీ, మరమ్మతులకు అవసరమైన అధునాతన టూల్స్ అందుబాటులోకి వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

విమానాలు, విమాన ఇంజిన్ల తయారీ, నిర్వహణకు ప్రత్యేక పరికరాలు తయారవుతాయని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. ఇప్పటివరకు విదేశాలపై ఆధారపడుతున్న టూలింగ్ అవసరాలకు ఇకపై స్థానికంగానే తయారవుతాయని అన్నారు. ఏరోస్పేస్ రంగంలో జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ప్రకటించారు. డిజైన్, ఇంజినీరింగ్, ప్రెసిషన్ మ్యాన్యుఫ్యాక్చరింగ్‌కు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. గ్లోబల్ కంపెనీలతో స్థానిక ఎంఎస్ఎంఈల అనుసంధానానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. అడ్వాన్స్‌డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, రక్షణ రంగాలకు తెలంగాణను కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. 'తెలంగాణ రైజింగ్?2047' విజన్‌లో భాగంగా ప్రపంచ స్థాయి పారిశ్రామిక వాతావరణాన్ని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన ప్రణాళికలు అమలు చేస్తోందని మంత్రి శ్రీదర్ బాబు వివరించారు.

షాద్‌నగర్ పారిశ్రామిక ప్రగతిలో మరో మైలురాయి: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

తిగాపూర్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏరోస్పేస్ టూలింగ్ సెంటర్ ఏర్పాటు కావడం సంతోంగా ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ పారిశ్రామిక ప్రగతిలో ఇది మరో మైలురాయిగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. విమానాలు, ఏరో ఇంజిన్ల తయారీ, నిర్వహణకు అవసరమైన అత్యాధునిక పరికరాలు, ఫిక్చర్లను ఈ కేంద్రంలో తయారు చేయనున్నట్లు వివరించారు. ఇప్పటివరకు దిగుమతులపై ఆధారపడిన ఈ రంగంలో దేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఈ సంస్థ దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి ప్రెసిషన్ ఇంజినీరింగ్ కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు, తెలంగాణలో ఆధునిక పరిశ్రమల అభివృద్ధికి ఇలాంటి సంస్థలు తోడ్పడతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పారిశ్రామిక రంగానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. షాద్‌నగర్ ప్రాంతంలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో సంస్థను ఏర్పాటు చేసినందుకు జేఈహెచ్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధుల బృందానికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తూర్ మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, అంబటి ప్రభాకర్, సాయిలు, కొర్ర రవి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగివున్న టిప్పర్‌ను ఢీకొట్టిన వ్యాన్.. ముగ్గురు దుర్మరణం..!



న్యూ ఢిల్లీ, నవంబర్ 17: ఆగివున్న టిప్పర్ లారీని మహీంద్రా పికప్ వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. మరో 27 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పంజాబ్ రాష్ట్రం లూధియానా జిల్లా మచ్చివారా ప్రాంతంలోని పవాత్ వంతెన సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మంగళవారం మధ్యాహ్నం యాత్రికులతో వెళ్తున్న మహీంద్రా పికప్ వాహనం, ఆగి ఉన్న టిప్పర్ లారీని బలంగా ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో ఇద్దరు మైనర్లు సహా ముగ్గురు భక్తులు మరణించారు. మరో 27 మంది గాయపడ్డారు. బాధితులు మాతా నైనా దేవి ఆలయాన్ని దర్శించుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. వారంతా మచ్చివారా ప్రాంతంలోని వలస కార్మికుల కాలనీకి చెందినవారిగా తెలిసింది. మృతుల్లో 17 ఏళ్ల గౌరవ్, 14 ఏళ్ల మరో బాలుడు, 36 ఏళ్ల మహిళ ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

ప్రమాదానికి గురైన వాహనంలో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసి మచ్చివారా, నమీవ ప్రాంతాల్లోని ఆసుపత్రులకు తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉందన్నారు. ఈ ప్రమాదం మరోసారి రహదారి భద్రతపై ఆందోళనలను రేకెత్తించింది.

# రాష్ట్రానికి ఆర్థిక సాయం కోరిన సీఎం

అమరావతి, నవంబర్ 17: సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఆమెతో చర్చించారు. ముఖ్యంగా రాయలసీమ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టు ప్రతిపాదనల అమలుపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. తుపానుల కారణంగా నష్టపోయిన రాష్ట్రాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇటీవల రాష్ట్రంలో అర్నబ్, మురసు తుపానులతో పాటు ఎల్‌నినో ప్రభావం వల్ల జరిగిన నష్టాన్ని కేంద్ర మంత్రికి వివరించారు. నష్టం అంచనాలకు సంబంధించిన నివేదికలను ఇప్పటికే కేంద్రానికి పంపినట్లు గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సహాయం అందించాలని నిర్మలా సీతారామన్‌ను అభ్యర్థించారు.

అధికారిక సమావేశం అనంతరం చంద్రబాబు ఢిల్లీలో ప్రముఖ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా నివాసంలో జరిగే శుభకార్యానికి హాజరుకానున్నారు. కార్యక్రమం ముగిసిన తర్వాత రాత్రికి అమరావతికి తిరుగు ప్రయాణం కానున్నారు.

# వేయిస్తంభాల రుద్రేశ్వరస్వామికి పుష్పాభిషేకం



హన్మకొండ, నవంబర్ 17: (నేటినిజం ప్రతినిధి) చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో కార్తీక మాసం 8వ రోజు మంగళవారం ప్రీతికరంగా మహోన్నితమైన రోజు ఉదయం నిత్యాన్నికా కార్యక్రమాలు నిర్వర్తించి రుద్రేశ్వర స్వామికి 11 లీటర్ల మధు(తేనే)తో అమృత అభిషేకం నిర్వర్తించారు. సామూహిక రుద్రాభిషేకం అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు డాక్టర్ కరుణాకర్, దీప్తి దంపతుల సౌజన్యంతో రుద్రేశ్వరస్వామికి రుద్రనామాలతో పుష్పాభిషేకం నిర్వర్తించి, సిరానైవేద్యం సమర్పించి, ద్వాదశ జ్యోతులతో మహా హారతి, డమరుక వాయిద్యాలతో శంకు నాదాలతో గంటా వాయిద్యాల మధ్య ఘనఘన గంటల మధ్య మహా హారతి నిర్వర్తించారు.

నీరాజనం అనంతరం మహా మంత్రపుష్పం నిర్వర్తించి భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో ఆంజనేయస్వామి సన్నిధిలో కార్తీక సమారాధన వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. వైదిక కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ, వేద పండితులు మణికంఠశర్మ, దత్త కుమార్‌శర్మ నిర్వహించారు.

# సమ్మక్క సాగర్ బ్యారేజీ.. ఎన్ఓసీ జారీకి ఛత్తీస్‌గఢ్ సీఎం సానుకూలం..!



హైదరాబాద్, నవంబర్ 17: ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయితో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈరోజు (మంగళవారం) ఛత్తీస్‌గఢ్‌లో సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీ ఇవ్వాలని ఛత్తీస్‌గఢ్ సీఎంకు రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎన్ఓసీ జారీకి ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి సానుకూలంగా స్పందించారు. ఎన్ఓసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణకు నీటి అవసరాలు పెరగనున్నా యని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.

సమ్మక్క సాగర్‌లో నీటి నిల్వకు అనుమతి ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన అనుమతులపైనా ఛత్తీస్‌గఢ్ సీఎంతో చర్చించారు. ఈ రాష్ట్రంలో భూసేకరణ, పరిహారం, పునరావాసానికి నిధులు చెల్లించేందుకు తెలంగాణ సర్కార్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయనం ప్రకారం ఛత్తీస్‌గఢ్‌లో 33 ఎకరాల వరకే ముంపు ఉందని అన్నారు. భారీ వరదల సమయంలోనూ 100 ఎకరాలకు ముంపు ప్రాంతం మించలేదని తెలిపారు.

ఇప్పటికే తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం పూర్తయిందని తెలంగాణ సీఎం వెల్లడించారు. అలాగే, 83 మీటర్ల పూర్తిస్థాయి నీటిమట్టం వద్ద 6.94 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉందని వివరించారు. సాగు, తాగునీటి అవసరాలకు గోదావరి జలాల వినియోగమే లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో అంతర్రాష్ట్ర గంజాయి రవాణా ముఠా గుట్టురట్టు

హైదరాబాద్, నవంబర్ 17: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్న ఓ ముఠాను తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 10.50 లక్షల విలువైన 21 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులు కథనం ప్రకారం.. అంతర్రాష్ట్ర గంజాయి రవాణా, విక్రయాలపై.. హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో.. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు గంజాయిని తరలిస్తూ దందా కొనసాగిస్తున్న ఓ అంతరాష్ట్ర ముఠా గుట్టురట్టు చేశారు. బాలాపూర్ పోలీసులు, చార్మినార్ టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి.. గంజాయి రవాణా చేస్తున్న ముఠాపై దాడి చేశారు.

ఈ ఆకస్మిక దాడిలో అంతరాష్ట్ర గంజాయి రవాణాదారుడు మహమ్మద్‌ను అరెస్ట్ చేయగా.. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఈ మేరకు నిందితుడి నుంచి రూ. 10.50 లక్షల విలువైన 21 కేజీల ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాలోని బెర్హంపూర్ నుంచి హైదరాబాద్‌కు ఈ గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. కాగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని.. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని పోలీసులు వెల్లడించారు.

# కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు ..ముగ్గురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

మహబూబ్‌నగర్, నవంబర్ 17 జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, పారిశుద్ధ్యం, వార్డుల నిర్వహణను పరిశీలించారు. హాజరు నమోదు చేయని ముగ్గురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

రోగుల నుంచి డబ్బులు వసూలు చేసినా, బయట మందులు కొనాలని సూచించినా, ప్రైవేట్ ఆసుపత్రులకు అనవసరంగా రిఫర్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రి అభివృద్ధి, మరమ్మతుల కోసం రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి పేద రోగికి నాణ్యమైన వైద్యం అందించాలని, విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు

# వెండి కాదు.. అల్యూమినియం!
# హైదరాబాద్‌లో నకిలీ సిల్వర్ ఫాయిల్ దందా గుట్టురట్టు

హైదరాబాద్, నవంబర్ 17: నగరంలో నకిలీ సిల్వర్ ఫాయిల్ (ప్రతిశ్రీలవతీ ఈనీతిశ్రీ) తయారీ కేంద్రాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. చార్మినార్, ఫలక్‌నుమా పరిధిలోని నాలుగు కేంద్రాల్లో అల్యూమినియం ఆకులతో తయారు చేసిన నకిలీ సిల్వర్ ఫాయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. 49 బండిళ్లు, 13 కిలోలకు పైగా అల్యూమినియం ఫ్లేక్స్ సీజ్ చేశారు. నకిలీ సిల్వర్ ఫాయిల్ దందా వివరాలను నూతన సీపీ మహేష్ భగవత్ మీడియాకు తెలియజేశారు. హైదరాబాద్‌లో నకిలీ సిల్వర్ ఫాయిల్ తయారీ కేంద్రాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారని.. ఈ సందర్భంగా అసలైన వెండి ఫాయిల్‌కు బదులుగా అల్యూమినియం ఆకులు, ఫ్లేక్స్‌తో నకిలీవి తయారీ చేస్తున్నట్లు తనిఖీల్లో బయటపడిందన్నారు. ప్రజలకు తెలియకుండా స్వీట్లు, పాన్, బేకరీ ఉత్పత్తుల్లో అల్యూమినియం వినియోగిస్తున్నారని.. అలాగే కాజు కట్లీ, చమ్ చమ్, స్వీట్ పాన్, కేకుల్లో నకిలీ సిల్వర్ ఫాయిల్‌ను వినియోగిస్తున్నట్లు వెల్లడించారు.

ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి అల్యూమినియం మెటీరియల్‌ను దిగుమతి చేసుకుంటున్నారని సీపీ తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా స్వీట్ షాపులు, బేకరీలు, పాన్ షాపులకు నకిలీ ఫాయిల్ సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారన్నారు. మొత్తం నాలుగు కేంద్రాలపై కేసులు నమోదు చేశామని తెలిపారు. చార్మినార్‌లోని ఇత్తెహాద్ వరాక్ షాప్, హుస్సేనిఆలంలోని యూటీసీ సిల్వర్ లీఫ్స్, మొఘల్‌పురాలోని ఎం.ఏ. మెట్రో వరాక్ షాప్, ఫలక్‌నుమాలోని తారా యూనిట్‌ల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. దాడిలో భాగంగా 49 బండిళ్ల నకిలీ సిల్వర్ ఆకులు, 13 కిలోలకు పైగా అల్యూమినియం ఫ్లేక్స్ సీజ్ చేశామని.. కిలో నకిలీ షుగర్ బాల్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అంతేకాకుండా భారీగా తంబాకు, టాల్కమ్ పౌడర్, పాన్ చట్నీలు పట్టుబడిందన్నారు. తయారీకి ఉపయోగించే మిక్సర్లు, ప్యాకింగ్ మెషిన్లను సీజ్ చేసినట్లు తెలిపారు. జంతు చర్మాలతో తయారైన ఐదు బుక్స్ షీట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలకు విరుద్ధంగా ఈ వ్యవహారం సాగుతోందని తెలిపారు.

నకిలీ సిల్వర్ ఫాయిల్ వినియోగంతో కిడ్నీలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని సీపీ వెల్లడించారు. నరాల సంబంధిత సమస్యలు, ఎముకల వ్యాధులు, జీర్ణకోశ సమస్యలు వచ్చే అవకాశం కూడా ఉందని తెలిపారు. అసలైన వెండి ఫాయిల్‌లో 99.9 శాతం వెండి ఉండాలని.. ఫాయిల్‌ను చేతితో సున్నితంగా రుద్దితే అసలైన వెండి పొడిలా విడిపోతుందని వెల్లడించారు. అల్యూమినియం అయితే చిన్న ముద్ద లేదా బాల్‌లా మారుతుందని.. ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించాలని సూచించారు. కెమికల్ టెస్ట్ ద్వారా పరీక్షించినప్పుడు నకిలీ సిల్వర్ ఫాయిల్ నలుపు రంగులోకి మారుతుందన్నారు. ప్రజలు స్వీట్లు, పాన్ ఉత్పత్తులు కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సీపీ మహేష్ భగవత్ హెచ్చరించారు.




# ఆంటీ-మైక్రోబియల్ నిరోధకత పట్ల అవగాహన కలిగి ఉన్నామా !

## (18-24 నలంబర్ : ప్రపంచ ఆంటీ-మైక్రోబియల్ నిరోధకత అవగాహన వారోత్సవాలు" సందర్భంగా)

అతి ప్రధానమైన 10 ప్రజారోగ్య సమస్యల్లో "ఆంటీ-మైక్రోబియల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్)" లేదా "ఆంటీ-మైక్రోబియల్ నిరోధకత"ను ఒకటిగా గుర్తించడంతో 2005 నుంచి ఐరాస ప్రతి ఏట 18-24 నవంబర్ రోజుల్లో "వరల్డ్ ఆంటీ-మైక్రోబియల్ అవేర్‌సెస్ వీక్" లేదా "ప్రపంచ ఆంటీ-మైక్రోబియల్ అవగాహన వారోత్సవాలు" పాటించుట ఆనవాయితీగా మారింది. బాక్టీరియా, వైరస్, ఫంగీ, పరాన్నజీవులు లాంటి సూక్ష్మజీవులు కలిగించే సాంక్రమిక వ్యాధులను త్వరగా, సమర్థవంతంగా నయం చేయడానికి ఆంటీ-మైక్రోబియల్ ఔషధాలను వాడుట అలవాటు అయ్యింది. కాలానుగుణంగా సూక్ష్మజీవుల్లో వస్తున్న మార్పులతో ఆంటీ-మైక్రోబియల్ డ్రగ్స్ పట్ల సూక్ష్మజీవులు నిరోధకతను పెంచుకొని, ఆ ఔషధాలకు రోగ కారక సూక్ష్మజీవులు లొంగకుండా మొండికేయడంతో అంటువ్యాధుల చికిత్సలకు అవాంతరాలు ఏర్పడి ప్రాణాంతక స్థితులకు చేరడంతో పాటు మరో "నిశ్శబ్ద విపత్తు" ఏర్పడుతున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాదకర విపత్తు వల్ల ఏడాదికి 70 లక్షల మంది ప్రాణాలు కోల్పోవడం, ఈ సంఖ్య 2050 వరకు 10 మిలియన్లకు చేరవచ్చని హెచ్చరిస్తున్నారు. ప్రపంచ ఏఎంఆర్ సమస్య ఆసియా, ఆఫ్రికా దేశాల్లోనే 90 శాతం వరకు విస్తరించిందని నిర్ధారణ అవుతున్నది.

### ఆంటీ-మైక్రోబియల్ రెసిస్టెన్స్ పెరగడానికి కారణాలు:

ఏఎంఆర్ పెరగడానికి ప్రధాన కారణాలుగా విచక్షణారహితంగా అధిక మోతాదులో ఆంటీ-మైక్రోబియల్ డ్రగ్స్ వాడడం, సురక్షిత నీటి కొరత, పారిశుద్ధ్యం సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రత లాంటి అవలక్షణాలతో మానవాళే కాకుండా జంతువులు, వ్యవసాయ పంటలు ప్రమాదంలో పడుతున్నాయి. 2000-15 మధ్య కాలంలో ఆంటీ-మైక్రోబియల్ డ్రగ్స్ వాడకం 65 శాతం వరకు పెరుగగా, 2030 నాటికి 200 శాతం పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. అలాగే 2017-30న మధ్య జంతు చికిత్సలకు వాడే ఆంటీబయోటిక్స్ 12 శాతం పెరగవచ్చనే అశుభ వార్తలు వింటున్నాం.

### ప్రపంచ ఆంటీ-మైక్రోబియల్ అవగాహన వారం -2026 ఇతివృత్తం :

ప్రపంచ ఆంటీ-మైక్రోబియల్ అవగాహన వారం-2026 ఇతివృత్తంగా "ఒకే ఆరోగ్యం, ఒకే చర్య : ఇప్పుడే ఏఎంఆర్‌ను కట్టడి చేద్దాం (వన్ ఫ్యూచర్, వన్ ఆక్షన్: ప్రివెంట్ ఎఎంఆర్ నౌ)" అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. ఏఎంఆర్ పట్ల అవగాహన కల్పించడానికి పౌరసమాజం, ప్రభుత్వ యంత్రాంగం, వెటర్నరీ విభాగం, రైతులు, ఫార్మసిస్టులు, విద్యావేత్తలు, యువజన సంఘాలు, సీనియర్ సిటిజెన్స్, వ్యవసాయ శాఖల సమన్వయంతో కృషి చేయాల్సి ఉంది. కరోనా విపత్తు సమయంలో అధిక శాతం రోగులకు ఆంటీబయాట్ ఔషధాలను విచక్షణారహితంగా, అధిక మోతాదులో వాడడంతో నేడు దాని దుష్ప్రభావాలు నేడు తీవ్రరూపం దాల్చడం, తీవ్ర అనారోగ్యాలు కలగడంతో పాటు ప్రాణాలు సహితం పోవడం చూస్తున్నాం. గత ఎనిమిది దశాబ్దాలుగా ఆంటీ-మైక్రోబియల్ ఔషధాలను విరివిగా వాడి రోగాలను నయం చేసే ప్రయత్నాలు చేయడంతో ఆ డ్రగ్స్ పట్ల నిరోధకత పెరిగి వాటి ప్రభావం పూర్తిగా తగ్గడం గమనిస్తున్నాం. ఏఎంఆర్ ఫలితంగా సూక్ష్మజీవుల కారణ సాంక్రమిక వ్యాధులకు చికిత్స కష్టం అవుతున్నది.

### ఏఎంఆర్ కట్టడి మార్గాలు:

రానున్న రోజుల్లో ఆంటీ-బాక్టీరియల్, ఆంటీబయాటిక్, ఆంటీలైరల్, ఆంటీఫంగల్, ఆంటీపారాసైటిక్స్ లాంటి ఔషధాలు పని చేయక పోవడంతో, వ్యాధుల కట్టడి వైద్యులకు కష్టం కావడంతో మరో ప్రమాదకర సంక్షోభానికి లేదా విపత్తుకు తలుపులు తెరుచుకుంటున్నాయి. ఆంటీ-మైక్రోబియల్ డ్రగ్స్ పని చేయని యెడల రోగులు/జంతువులు/పంటలు కూడా ప్రభావితం కావడం, పలు సంబంధిత సమస్యలకు దారి తీస్తున్నాయి. వైద్యుల సలహాలు తీసుకోకుండా ఆంటీ-మైక్రోబియల్ డ్రగ్స్ వాడరాదు. ఆంటీ-మైక్రోబియల్ రెసిస్టెన్స్‌ను అదుపు చేయడానికి చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత శుభ్రత పాటించడం, సురక్షిత నీరు తాగడం, పరిశుద్ధ ఆహారం తీసుకోవడం, టీకాలు తీసుకోవడం, పరిసరాల పరిశుభ్రత, వ్యాధిగ్రస్తులకు దూరంగా ఉండడం, సురక్షిత లైంగిక సంబంధాలు కలిగి ఉండడం లాంటి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏఎంఆర్ ప్రతికూల ప్రభావంతో ప్రజలు, పశుసంపద, మత్స్యసంపద, పాడి పరిశ్రమ, ఆక్వాకల్చర్, హార్టీకల్చర్, పండ్ల తోటలు, పర్యావరణ వ్యవస్థలు దెబ్బతినే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఆంటీ-మైక్రోబియల్ ఔషధాలను వైద్యులు సూచించినట్లుగా విచక్షణతో వాడడం, మోతాదు మించకపోవడం, ఇతర జాగ్రత్తలను తూచా తప్పకుండా పాటించడం వల్ల ఏఎంఆర్ అదుపు చేయబడి మానవాళి, జంతువులు, పంటల ఆరోగ్యాలు వర్ధిల్లుతాయి.



-మధుపాళీ
9949700037

# కటక్‌లోని శ్రీ శ్రీ విశ్వవిద్యాలయంలో ఐకానిక్ టవర్‌ను ప్రారంభించిన ఉప రాష్ట్రపతి

న్యూఢిల్లీ, నవంబర్ 17: ఒడిశా లోని కటక్‌లో శ్రీ శ్రీ విశ్వవిద్యాలయంలో ప్రతిష్ఠాత్మక టవర్‌ను ఉప రాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ నేడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఒడిశా గవర్నర్ శ్రీ బ్రజ్ మోహన్ రామ్, రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ మోహన్ చరణ్ మాఝీ, శ్రీ శ్రీ యూనివర్సిటీ వ్యవస్థాపకులు, జీవితకాల అధ్యక్షులు గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ.. ఈ టవర్ ప్రారంభోత్సవం కేవలం ఒక భవనాన్ని ప్రారంభించడం మాత్రమే కాదని.. ఒక దార్శనికతకు, స్ఫూర్తిదాయకమైన విద్య ప్రాధాన్యతకూ, దేశ గొప్ప సాంస్కృతిక వారసత్వానికి, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాలన్న నిబద్ధతను ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

శ్రీ శ్రీ విశ్వవిద్యాలయం గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ అద్భుతమైన దార్శనికతకు ప్రతిరూపమని ఉప రాష్ట్రపతి అభివర్ణించారు. విద్యపై గురుదేవ్‌కు ఉన్న అవగాహన సంప్రదాయ విద్యా బోధన పరిధులను దాటి విస్తరించిందని అన్నారు. ప్రాచ్య వివేకం, పాశ్చాత్య జ్ఞాన సమ్మేళనంగా రూపుదిద్దుకున్న ఈ విశ్వవిద్యాలయం 2012లో విద్యా ప్రస్థానాన్ని ప్రారంభించిందని తెలిపారు. నిజమైన విద్య అనేది వ్యక్తి వ్యక్తిత్వాన్ని, చైతన్యాన్ని, కరుణా గుణాన్ని పెంపొందించాలన్న తాత్విక పునాదిపై ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటైందని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలోనూ ఈ దార్శనికత ఎంతో సముచితమైనదని చెప్పారు. విద్య యువతను కేవలం విద్యాపరమైన విజయాలకే కాకుండా, సమాజానికి అర్థవంతమైన సేవలందించేలా, ప్రపంచానికి బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేలా ఉండాలని ఉపరాష్ట్రపతి అన్నారు.

శ్రీశ్రీ విశ్వవిద్యాలయం తనను తాను "ప్రపంచంలోనే అత్యంత ఆనందకరమైన ప్రాంగణం"గా అభివర్ణించుకోవడం పట్ల ఉపరాష్ట్రపతి హర్షం వ్యక్తం చేశారు. ఆనందం అనేది యావత్ మానవాళి ఆకాంక్షించే అంశమని, అది భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో లోతుగా పాతుకుపోయిందని పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సాంస్కృతిక విలువలను ప్రోత్సహించేందుకు విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

ఒడిశా రాష్ట్ర గొప్ప నిర్మాణ, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలో నిర్మాణ కళ కేవలం భౌతిక కట్టడాల నిర్మాణానికి మాత్రమే పరిమితం కాలేదని ఉపరాష్ట్రపతి అన్నారు. అక్కడి ఆలయాలు కళాత్మక నైపుణ్యం, శాస్త్రీయ పరిజ్ఞానం, ఆధ్యాత్మికత, సాంస్కృతిక పరంపరకు చిరస్థాయిగా నిలిచే ప్రతీకలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. పూరీలోని పవిత్ర జగన్నాథ ఆలయం, భువనేశ్వర్‌లోని దేవాలయాలు, కోణార్క్ ఆలయ వైభవాన్ని ప్రస్తావిస్తూ.. కళింగ నిర్మాణ శైలి భారతీయ నాగరికతలోని అసాధారణ సృజనాత్మక ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోందని అన్నారు.

ఐకానిక్ టవర్ ఈ గొప్ప వారసత్వం నుంచి స్ఫూర్తి పొందిందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. దాని ఆరోహణ నిర్మాణ రూపం.. జ్ఞాన పునాదుల నుంచి విజ్ఞానం, జ్ఞానోదయం అనే ఉన్నత శిఖరాల వైపు మానవ ఆకాంక్షల ప్రస్థానాన్ని ప్రతిబింబిస్తోందని వివరించారు.

దేశ విస్తృత ఆకాంక్షలను ప్రస్తావిస్తూ.. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దేశానికి స్ఫూర్తిదాయకమైన దార్శనికతను అందించారని ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. స్వాతంత్ర్యం సాధించి వందేళ్లు పూర్తయ్యే నాటికి ఆత్మవిశ్వాసం, సామర్థ్యం, ప్రపంచ నాయకత్వంతో అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ఆవిర్భవించాలన్నది ఆయన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ జాతీయ ఆకాంక్షను సాకారం చేయడంలో విద్యా సంస్థలు కీలకమైన మార్పునకు దోహదపడతాయని ప్రధానమంత్రి పలుమార్లు స్పష్టం చేశారని తెలిపారు.

గత 12 ఏళ్లలో ఉన్నత విద్యా రంగం విస్తరించిన తీరును ఉపరాష్ట్రపతి వివరించారు. 2014-15లో దేశంలో విశ్వవిద్యాలయాల సంఖ్య 760 ఉండగా, ప్రస్తుతం 1,400కు పైగా పెరిగిందని తెలిపారు. 2014కు ముందు 16గా ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీల (ఐఐటీ) సంఖ్య ప్రస్తుతం 23కు చేరిందని.. ఇండియన్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ల (ఐఐఎం) సంఖ్య 13 నుంచి 22కు పెరిగిందని పేర్కొన్నారు. అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థల (ఎయిమ్స్) సంఖ్య కూడా 2014కు ముందు 7 ఉండగా, ప్రస్తుతం 20కి పెరిగిందని తెలిపారు. ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల నమోదు సంఖ్య 2014-15లో 3.42 కోట్లుగా ఉండగా, ప్రస్తుతం 4.50 కోట్లకు పైగా చేరిందని వెల్లడించారు.

ఒడిశాలో గణనీయమైన సంఖ్యలో గిరిజన జనాభా కలిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. గిరిజన పిల్లలు చదువుకు మధ్యలోనే దూరం కాకుండా, ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన ఒడిశాలోని అన్ని విశ్వవిద్యాలయాలు 'స్కూల్ కనెక్ట్' కార్యక్రమాలను ప్రారంభించాలని ఉపరాష్ట్రపతి కోరారు.

భారతీయ సాంస్కృతిక గుర్తింపు, జాతీయ బలానికి ఉన్న ప్రాధాన్యాన్ని ఉప రాష్ట్రపతి వివరించారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో దేశ సంస్కృతి, సంప్రదాయాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఎవరూ తమపై షరతులు, నిబంధనలు విధించలేని విధంగా భారత్ బలమైన, సామర్థ్యవంతమైన దేశంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. దేశ స్వాతంత్ర్యం, గౌరవం, ప్రయోజనాలను పరిరక్షించడంలో జాతీయ బలం ప్రాధాన్యతను ఆయన తెలియజేశారు.

ఒక వ్యక్తి గొప్పతనాన్ని అతని జ్ఞానం, వ్యక్తిత్వ బలం, కరుణా భావం విస్తృతి ఆధారంగా అంచనా వేస్తారని విద్యార్థులకు గుర్తుచేశారు. ఆలోచనలు, ఆచరణలో ఎల్లప్పుడూ 'దేశమే ప్రథమం' అనే సూత్రాన్ని పాటించాలని, 'మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి' అని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు.

ఐకానిక్ టవర్ ప్రతిబింబించే ఆదర్శాల పట్ల తమ నిబద్ధతను పునరుద్ధరించుకోవాలని విశ్వవిద్యాలయ వర్గాలకు ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. జ్ఞానం పునాదిగా, వివేకం మార్గదర్శకంగా, ఆవిష్కరణ సాధనంగా, కరుణ బలంగా, సేవ అంతిమ లక్ష్యంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఈ టవర్ తరతరాలకు విజ్ఞానానికి దారిచూపే మార్గదర్శిగా, ఆకాంక్షలకు ప్రతీకగా, ఒడిశా శాశ్వత స్ఫూర్తికి చిహ్నంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆత్మవిశ్వాసం, శ్రేయస్సు, కరుణ, అభివృద్ధితో కూడిన దేశ నిర్మాణానికి కృషి చేసేలా తరతరాల విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.

కొత్తగా ప్రారంభించిన శ్రీశ్రీ విశ్వవిద్యాలయం ఐకానిక్ టవర్‌లోని అత్యాధునిక ప్లానెటోరియాన్ని కూడా ఉపరాష్ట్రపతి సందర్శించారు. శాస్త్రీయ జిజ్ఞాస, ఆవిష్కరణ, నూతన ఆవిష్కరణల స్ఫూర్తిని చాటేలా ఈ ప్లానెటోరియం ఏర్పాటు చేశారు.

# వికసిత భారత్- 2047 దిశగా భారత్ పయనంలో ఒడిశా పురోగతి కీలక చోదక శక్తి: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, నవంబర్ 17:భువనేశ్వర్‌లో ఈ రోజు నిర్వహించిన 17వ ఒడిశా శాసనసభ సభ్యుల ఓరియంటేషన్ కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ ప్రసంగించారు. సుసంపన్నమైన భారత ప్రజాస్వామ్య సంప్రదాయాలను నిలబెట్టాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. విషయ పరిజ్ఞానంతో కూడిన నిర్మాణాత్మక చర్చలు, సమర్థమైన శాసనసభ, ప్రజలే కేంద్రంగా పరిపాలన... ప్రజాస్వామ్య సంస్థలను బలోపేతం చేయడంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశాలని ఆయన వ్యాఖ్యానించారు.

ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న స్పీకర్ శ్రీమతి సురమా పాధీని ఉపరాష్ట్రపతి అభినందించారు. ప్రజాస్వామ్య సంస్థలను బలోపేతం చేయడంలోనూ, సభ్యులు తమ రాజ్యాంగబద్ధ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించడంలోనూ ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

ప్రాచీనమైన భారత ప్రజాస్వామ్య సంప్రదాయాలను ప్రస్తావిస్తూ... వైశాలి, చోళ యుగం నాటి కూడవోళై వ్యవస్థ వంటి సంస్థాగత ప్రజాస్వామిక యంత్రాగాలను ఉపరాష్ట్రపతి ఈ సందర్భంగా ఉదాహరించారు. దేశ నాగరికతా చరిత్రలో ప్రజాస్వామ్య విలువలు బలంగా వేళ్లూనుకుని ఉన్నాయన్నారు. 'ప్రజాస్వామ్య తల్లి'గా మన్ననలు పొందుతూ భారత్ సార్థకత సాధించిందన్నారు. ఈ విశిష్ట వారసత్వాన్ని నిలబెట్టేలా నడుచుకోవాలని ఒడిశా శాసనసభ్యులకు ఆయన పిలుపునిచ్చారు.

ఎన్నికల విజయాలు అర్థవంతమైన ప్రజాసేవకు బాటలు వేయాలని ఉపరాష్ట్రపతి ఆకాంక్షించారు. "ఓట్ల ద్వారా మనం ఎన్నికల్లో గెలుస్తాం. కానీ, సేవా దృక్పథంతో మాత్రమే ప్రజల గౌరవాన్ని పొందగలం" అన్నారు. శాసనసభ కేవలం ఒక చర్చావేదిక మాత్రమే కాదన్న ఆయన.. సభలో రూపుదిద్దిన ప్రతి విధానమూ, ఇక్కడ లేవనెత్తిన ప్రతి ప్రశ్నా, సభ అమలు చేసే ప్రతి చట్టమూ అసంఖ్యాక ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాయని వ్యాఖ్యానించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్ ? 2047' సంకల్పాన్ని ప్రస్తావిస్తూ.. దేశ పురోగతిలో ఒడిశా అభివృద్ధి అత్యంత కీలకమైన అంశమన్నారు. ఒడిశా ప్రావిన్సుగా ఏర్పడి 2036తో వందేళ్లు పూర్తికానున్న నేపథ్యంలో.. అభివృద్ధి చెందిన, సంపన్నమైన, సమ్మిళిత రాష్ట్రంగా ఒడిశాను నిలపడంలో 'విజన్ ఒడిశా-2036' ప్రాధాన్యాన్ని ఆయన స్పష్టం చేశారు. యువతకు అవకాశాలను కల్పించడంలోనూ, అభివృద్ధి ఫలితాలు ఊరూరికీ ఇంటింటికీ అందేలా చూడడంలోనూ శాసనసభ్యులు ముఖ్య పాత్ర పోషిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

శాసనపరమైన కార్యకలాపాలకు ఆటంకాలు కలిగించడం తగదని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రజలు, రాజ్యాంగం పట్ల మన నిబద్ధతకు అభిప్రాయ భేదాలు అడ్డుకాకూడదని ఉపరాష్ట్రపతి స్పష్టం చేశారు. ''ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను అంగీకరించవచ్చు. కానీ ప్రజలు, రాజ్యాంగం పట్ల మన అంకితభావం విషయంలో మనమంతా ఏకీభవించాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. "చర్చ, సంభాషణ, కొన్నిసార్లు ఆటంకాలు కూడా 'సరైన నిర్ణయాలు తీసుకునేందుకు ఉపకరించాలి" అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, దేశ పురోగతిని ముందుకు తీసుకెళ్లడానికి ఆరోగ్యకరమైన చర్చలు, నిర్మాణాత్మక సహకారం కోసం ఆయన పిలుపునిచ్చారు.

నిరంతర అభ్యసనం, సన్నద్ధత అత్యంత ప్రధానమైన అంశాలని పేర్కొంటూ.. శాసన సభ నియమాలు, విధానాలు, బడ్జెట్ ప్రక్రియలు, కమిటీ వ్యవస్థలు, పార్లమెంటరీ సంప్రదాయాలు, నైతిక విలువలను సభ్యులు క్షుణ్ణంగా తెలుసుకోవాలని ఉపరాష్ట్రపతి కోరారు.

ముఖ్యంగా సభ్యులు తమ నియోజకవర్గ సమస్యలనూ, విధానపరమైన అంశాలనూ లేవనెత్తడానికి ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ కీలకమైన అవకాశాలని ఆయన ప్రత్యేకంగా పేర్కొన్నారు. సభ్యులు సభాధ్యక్షుడికి సహకరిస్తూ అమిత ప్రాధాన్యం గల ఈ పార్లమెంటరీ సంప్రదాయాలకు ఏ అంతరాయమూ కలగకుండా చూడాలని కోరారు.

సభ నిర్వహణకు సంబంధించి ఏకాభిప్రాయాన్ని పెంపొందించడంలో సభా వ్యవహారాల సలహా సంఘం (బీఏసీ) కీలక పాత్ర పోషిస్తుందని కూడా ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. కమిటీలో ఏకాభిప్రాయం ఉంటే శాసన ప్రక్రియలు మరింత సజావుగా, అత్యంత ఫలప్రదంగా సాగుతాయన్నారు.

శాసనసభ వ్యవహారాల నిర్వహణలో సాంకేతికత పాత్ర క్రమంగా పెరుగుతున్న తీరును ఉపరాష్ట్రపతి ప్రధానంగా ప్రస్తావించారు. జాతీయ ఇ-విధాన్ అప్లికేషన్ కింద ఒడిశా శాసనసభలో డిజిటల్ హౌస్ ప్రారంభోత్సవాన్ని స్వాగతించారు. రాజ్యసభలో డిజిటల్ వేదికల వినియోగం క్రమంగా పెరుగుతోందన్నారు. పార్లమెంటరీ పత్రాలు, ప్రశ్నలు, చర్చలు సాంకేతికత సాయంతో అనేక భాషల్లో నేడు అందుబాటులోకి వచ్చాయని ఆయన వివరించారు. కృత్రిమ మేధ, సహజ భాషా ప్రాసెసింగ్ సహా అధునాతన సాంకేతికతలను అందిపుచ్చుకుంటూ.. శాసన సంస్థలను భవిష్యత్ సన్నద్ధంగా నిలపాలని సభ్యులను కోరారు.

సభ్యులపై ఉన్న అపారమైన బాధ్యతను, సమూల మార్పులను తీసుకురాగల వారి సామర్థ్యాన్ని శాసనసభ్యులకు గుర్తుచేస్తూ ఉపరాష్ట్రపతి తన ప్రసంగాన్ని ముగించారు. ఆలోచనాత్మకమైన చర్చలు విధానపరమైన మార్పులను తీసుకురాగలవనీ, కరుణతో కూడిన నిర్ణయం అసంఖ్యాక ప్రజల జీవితాల్లో తిరిగి ఆశను చిగురింపజేయగలదనీ ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఓరియంటేషన్ కార్యక్రమం ఫలప్రదంగా సాగాలనీ, వారి సభా ప్రయాణం అర్థవంతంగా ఉండాలనీ ఆకాంక్షిస్తూ.. 17వ ఒడిశా శాసనసభ సభ్యులందరికీ ఉపరాష్ట్రపతి శుభాకాంక్షలు తెలిపారు.

ఒడిశా గవర్నర్ శ్రీ బ్రజ్ మోహన్ రామ్, ముఖ్యమంత్రి శ్రీ మోహన్ చరణ్ మాఝీ, శాసనసభ స్పీకర్ శ్రీమతి సురమా పాధీ, డిప్యూటీ స్పీకర్ శ్రీ భవానీ శంకర్ భోయ్, 17వ ఒడిశా శాసనసభ సభ్యులు, తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: కలెక్టర్ రాజార్షి షా

## ఆదిలాబాద్ ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి రూ.5 లక్షలు.. పనులకు భూమిపూజ



ఆదిలాబాద్, నవంబర్ 17: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా మీడియా ప్రతినిధులకు సూచించారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్ అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు చేరేలా మీడియా తన వంతు బాధ్యత నిర్వహించాలని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండాలని అన్నారు. ఈ నెల 19 నుంచి ఇందిరమ్మ అభయం పథకం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుందని తెలిపారు.

ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి రూ.5 లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో ప్రహరీ గోడ, ఫ్లోరింగ్, అదనపు గది, శౌచాలయ నిర్మాణ పనులు చేపట్టి నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులోనూ ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ సంతోష్, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల నాయకులు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి ఎమ్మెల్యే అండ



ఆదిలాబాద్, నవంబర్ 17:అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిజాం వైద్య విజ్ఞాన సంస్థ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంచిర్యాల నియోజకవర్గం దండేపల్లి మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన దుమల్లా అమూల్య కుటుంబానికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అండగా నిలిచారు.అమూల్య వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2 లక్షల 50 వేల ఆర్థిక సహాయం మంజూరు చేయించి, సంబంధిత అనుమతి పత్రాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. నిరుపేద కుటుంబానికి వైద్య చికిత్స ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# అప్పుల భారం.. టైలర్ ఆత్మహత్య!

కరీంనగర్, నవంబర్ 17: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జగిత్యాల పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని తీన్‌ఖని చౌరస్తా వద్ద శ్రీరాం టైలర్స్ నిర్వహిస్తున్న శంకర్ (42) మంగళవారం తన దుకాణంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

వ్యాపారం సరిగా సాగకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ మహేష్ బి. గితే

## ర్యాగింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



రాజన్న సిరిసిల్ల,నవంబర్ 17: (నేటినిజం ప్రతినిధి): విద్యార్థులు సోషల్ మీడియా, ఆన్‌లైన్ వేదికలను వినియోగించేటప్పుడు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. మంగళవారం సిరిసిల్లలోని మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.

గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, అనుమానాస్పద లింకులను నమ్మవద్దని, వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు, బ్యాంకు సమాచారం ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదివి ఉత్తమ వైద్యులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేధింపులు ఎదురైతే యాంటీ ర్యాగింగ్ కమిటీని ఆశ్రయించాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, విద్యార్థినులు వేధింపులకు గురైతే షీ టీం నంబర్ 87126 56425కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, అధ్యాపకులు, సైబర్ సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో పేదలకు చేయూత

## –ప్రభుత్వ విప్ విజయరమణారావు



కరీంనగర్, నవంబర్ 17: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలో పేదలకు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి చేయూతనిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు పేర్కొన్నారు.

మంగళవారం ఓదెల మండలం పొత్కపల్లి గ్రామంలో ప్రభుత్వం నూతనంగా చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంతో పాటు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 664 చేయూత పెన్షన్లు మంజూరు పత్రాలను 43 కళ్యాణ్ లక్ష్మి చెక్కులను పంపించేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా 5 లక్షల పెన్షన్లలో పెద్దపల్లి నియోజకవర్గంలో 5200 పెన్షన్లు మంజూరు చేసినట్లు రానున్న కాలంలో వృద్ధులకు సైతం పెన్షన్లు రానున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అనుకొని విధంగా రానున్న కొద్దికాలంలో పెన్షన్ల పెంపుదల సైతం జరగనున్నట్లు ప్రజల సంక్షేమ ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు పెడుతున్నారని తెలిపారు. ఓదెల మండలంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి జరుగుతున్నాయని, ముఖ్యంగా మండల కేంద్రం ఓదెల చుట్టూతోపాటు మల్లికార్జున స్వామి ఆలయ చుట్టూ అనేక రోడ్లు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అన్ని గ్రామాలకు ఎక్కడలేని విధంగా డబల్ రోడ్లు మంజూరవుతున్నాయని, గ్రామాలలో ఎలాంటి వివక్షత చూపకుండా రాజకీయాలతో సంబంధం లేకుండా అభివృద్ధి చేయుటకు ముందు మండలంలో ఇల్లు లేని ప్రతి పేదవారికి ఇల్లు మంజూరు చేసే బాధ్యత నాదేనని స్పష్టం చెశారు.

కార్యక్రమంలో డీఆర్డీవో కాళిందిని, తహసీల్దార్ మహమ్మద్ షఫీ, ఎంపీడీఓ అనిల్రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, మండల పరిషత్ సూపరిండెంట్ పాషా, మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు పిట్టల రవి, సర్పంచ్లు చొప్పరి సంధ్య కుమార్, గ్యారవేణి విజయ నాగరాజ్, రాగిడి మంగ శ్రీనివాస్ రెడ్డి, కనికిరెడ్డి సతీష్, పల్లె కనుకయ్య, గోలి లింగారెడ్డి, మధ్యవేన రవియాదవ్, జీల రాజు యాదవ్, నిమ్మ నాయక్, ఆవాల ప్రసాద్, చిట్ల రాము, నర్సింంహారెడ్డి ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షులు రెడ్డి రజినీకాంత్, ఓదెల ఉప సర్పంచ్ గోపతి శ్రీలత ప్రవీణ్, నాయకులు ఆకుల మహేందర్, బైరి రవి గౌడ్, కొప్పుల రవి, కుంచం మల్లయ్య, ఊరగొండ వినయ్, వడాల రాజు, పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఫిలిప్పీన్స్ పర్యటనకు బయలుదేరే ముందు ప్రధానమంత్రి ప్రకటన

న్యూ ఢిల్లీ, నవంబర్ 17: అధ్యక్షుడు ఫెర్డినాండ్ ఆర్. మార్కోస్ జూనియర్ ఆహ్వానం మేరకు 2026 నవంబర్ 17న జరిగే 23వ ఆసియాన్-ఇండియా సదస్సు, 21వ తూర్పు ఆసియా సదస్సులో పాల్గొనేందుకు నేను ఈ రోజు మనీలా పర్యటనకు బయలుదేరుతున్నాను.

ఆసియాన్ దేశాలతో మన సంబంధం భారతదేశపు యాక్ట్ ఈస్ట్ పాలసీకి హృదయం లాంటిది. అలాగే మన మహాసాగర్ దార్శనికతలో ప్రధాన కేంద్రంగా ఉంది. శతాబ్దాల నాగరికతా ఆదానప్రదానాలతో మన సంబంధాలు బలోపేతమయ్యాయి. ఇవి వాణిజ్యం, అనుసంధానం, నౌకావాణిజ్య భద్రత, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజా సంబంధాలు విస్తరించి క్రియాశీలక భాగస్వామ్యంగా వృద్ధి చెందాయి.

ఆసియాన్-భారత శిఖరాగ్ర సమావేశంలో మన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో సాధించిన పురోగతిని మరింత ముందుకు తీసుకెళ్లడానికి, వృద్ధి, అనుసంధానం, శ్రేయస్సు కోసం మన ఉమ్మడి ఆకాంక్షలకు మరింత వేగాన్ని అందించడానికి తోటి నాయకులతో కలిసి పనిచేయడానికి నేను ఎదురుచూస్తున్నాను.

ప్రాంతీయ, ప్రపంచ సవాళ్లపై చర్చించేందుకు ఒక ముఖ్యమైన వేదికను తూర్పు ఆసియా శిఖరాగ్ర సమావేశం అందిస్తుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనే నాయకులతో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, సహకారాన్ని బలోపేతం చేయడంపై అభిప్రాయాలను పంచుకొనేందుకు ఎదురుచూస్తున్నాను.

ఫిలిప్పీన్స్‌లో ఉన్న భారతీయ సమాజంతో ముచ్చటించేందుకు నేను కూడా ఎదురుచూస్తున్నాను. వారి సహకారం మన రెండు దేశాల మధ్య స్నేహ బంధాలను మరింత బలోపేతం చేస్తుంది.

ఈ పర్యటన ఆసియాన్‌తో భారతదేశ భాగస్వామ్యానికి కొత్త శక్తిని ఇస్తుందనీ, శాంతి యుతమైన, సుసంపన్నమైన, పటిష్టమైన ఇండో-పసిఫిక్ పట్ల మన ఉమ్మడి నిబద్ధతను బలోపేతం చేస్తుందని విశ్వసిస్తున్నాను.

# నిరుపేద కుటుంబానికి ఎమ్మెల్యే అండ

ఆదిలాబాద్, నవంబర్ 17: అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిజాం వైద్య విజ్ఞాన సంస్థ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంచిర్యాల నియోజకవర్గం దండేపల్లి మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన దుమల్లా అమూల్య కుటుంబానికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అండగా నిలిచారు.

అమూల్య వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2 లక్షల 50 వేల ఆర్థిక సహాయం మంజూరు చేయించి, సంబంధిత అనుమతి పత్రాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. నిరుపేద కుటుంబానికి వైద్య చికిత్స ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడానికి సంయుక్త వాణిజ్య కమిటీ ఏడో మంత్రిత్వ స్థాయి సమావేశం నిర్వహించిన భారత్, ఈజిప్టు

న్యూ ఢిల్లీ, నవంబర్ 17: ఈజిప్టు నూతన పరిపాలనా రాజధానిలో ఈ రోజు జరిగిన భారత్-ఈజిప్ట్ సంయుక్త వాణిజ్య కమిటీ (జేటీసీ) ఏడో సమావేశానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్, ఈజిప్ట్ పెట్టుబడులు, విదేశీ వాణిజ్య శాఖ మంత్రి డాక్టర్ మొహమ్మద్ ఫరీద్ సలేహ్ సంయుక్తంగా అధ్యక్షత వహించారు. మంత్రిత్వ స్థాయిలో ఈ ముఖ్యమైన ద్వైపాక్షిక సంస్థాగత వేదిక సమావేశం కావడం ఇదే తొలిసారి. భారత్-ఈజిప్ట్ వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఆర్థిక కోణాన్ని బలోపేతం చేసేందుకు రెండు దేశాల ప్రభుత్వాలు ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఈ కార్యక్రమం స్పష్టం చేస్తోంది.

ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 12 బిలియన్ల అమెరికన్ డాలర్లకు విస్తరించే లక్ష్యానికి కట్టుబడి ఉన్నట్లు ఉభయ పక్షాలు పునరుద్ఘాటించాయి. వాణిజ్య వైవిధ్యీకరణ, విలువ ఆధారిత ఎగుమతులను ప్రోత్సహించడం, వాణిజ్య సంబంధిత సవాళ్లను పరిష్కరించడం అత్యవసరమని స్పష్టం చేశాయి. ప్రాధాన్య వాణిజ్య ఒప్పందం లేదా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం విధివిధానాలను పరిశీలించేందుకు ఒక సంయుక్త కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేయాలని ఇరువురు మంత్రులు అంగీకరించారు. ఇది ఏడో సంయుక్త వాణిజ్య కమిటీ సమావేశంలో సాధించిన ముఖ్యమైన ఫలితం. ఇరు దేశాల మధ్య బలమైన ద్వైపాక్షిక వాణిజ్యాన్ని సులభతరం చేసేందుకు, రెండు దేశాల మార్కెట్లలో అవకాశాలను మెరుగుపరిచేందుకు, పెట్టుబడుల అనుసంధానాన్ని ప్రోత్సహించేందుకు ఇది తోడ్పడుతుంది.

ఈ సమావేశానికి ముందు వాణిజ్య విస్తరణ, పెట్టుబడుల ప్రోత్సాహం, దీర్ఘకాలిక పారిశ్రామిక, వాణిజ్య సంబంధాల అభివృద్ధిపై మంత్రులిద్దరూ ద్వైపాక్షిక చర్చలను నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న వాణిజ్య సంబంధాలను సమీక్షించేందుకు, వ్యాపార సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లను అంచనా వేసేందుకు, మరింత సన్నిహిత సహకారం కోసం కొత్త రంగాలను గుర్తించే వేదికను ఈ జేటీసీ అందించింది.

2025-26 ఆర్థిక సంవత్సరంలో (2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు) 35 శాతం వృద్ధితో 6.5 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకున్న భారత్-ఈజిప్ట్ వాణిజ్య పురోగతిని కమిటీ సమీక్షించింది. 2025లో ఇదే సమయంలో నమోదైన 3.08 బిలియన్ డాలర్లతో పోలిస్తే 2026 ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య కాలంలో వాణిజ్యం 65 శాతం పెరిగి 5.04 బిలియన్ డాలర్లకు చేరింది. ఈ పెరుగుదల వాణిజ్య కార్యకలాపాల్లో వేగాన్ని, వాణిజ్య రంగాలను మరింత విస్తరించేందుకు ఉన్న అవకాశాలను సూచిస్తోంది. పారిశ్రామిక వస్తువులు, ఇంధనం, ఎరువులు, రసాయనాలు, ఔషధాలు, ఇంజనీరింగ్, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తుల రంగాల్లో వాణిజ్యాన్ని మరింత పెంచుకునేందుకు ఇరు దేశాల మధ్య అనుకూల పరిస్థితులు ఉన్నాయి.

వాణిజ్యాన్ని విస్తరించడం, సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేయడం, స్థిరమైన వాణిజ్య మార్గాలను ఏర్పాటు చేయడంపై చర్చలు ప్రధానంగా దృష్టి సారించాయి. వాణిజ్య విస్తరణ, సుంకేతర అడ్డంకులను తొలగించడం, కస్టమ్స్ ప్రక్రియలను సులభతరం చేయడం, నాణ్యతా ప్రమాణాలను, మదింపును బలోపేతం చేయడం, మార్కెట్ అవకాశాలను మెరుగుపరచడం లాంటి చర్యలను ఇరు పక్షాలు పరిశీలించాయి. ఉత్పత్తుల రిజిస్ట్రేషన్, వాణిజ్య సంబంధిత నియంత్రణ ప్రక్రియలతో సహా వ్యాపార కార్యకలాపాలను ప్రభావితం చేస్తున్న ఆచరణాత్మక సమస్యలపై కూడా వారు చర్చించారు.వ్యాపార సంబంధాలను బలోపేతం చేయడం, ఉమ్మడి తయారీ, పెట్టుబడులను ప్రోత్సహించడంపై కూడా చర్చలు కేంద్రీకృతమయ్యాయి. ఔషధాలు, వైద్య పరికరాలు, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ పరికరాలు, ఎరువులు, వస్త్రాలు, పునరుత్పాదక ఇంధనం, కొత్తగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలు దీనిలో ప్రాధాన్య రంగాలుగా ఉన్నాయి. ఈజిప్ట్ పారిశ్రామిక జోన్లలో భారతీయ పెట్టుబడులకు ఉన్న అవకాశాలతో పాటు, విస్తరిస్తున్న భారత తయారీ, సేవా రంగాల్లో ఈజిప్ట్ పెట్టుబడుల అంశం కూడా ఈ ఎజెండాలో ఒక ముఖ్య భాగంగా నిలిచింది.

పెట్టుబడుల సమాచారాన్ని పంచుకునేందుకు, వ్యాపార సంబంధాలను సులభతరం చేసేందుకు ప్రతిపాదించిన డిజిటల్ వేదికతో సహా ఇన్వెస్ట్ ఇండియా, ఈజిప్ట్ జనరల్ అథారిటీ ఫర్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫ్రీ జోన్స్ మధ్య ఉన్న విధాన ఒప్పందాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఇరు పక్షాలు ఆసక్తి వ్యక్తం చేశాయి.

సూయజ్ కాలువకు చేరువగా ఉండటం, ఆఫ్రికన్, అరబ్, యూరోపియన్ మార్కెట్లతో అనుసంధానం కలిగి ఉండటం వల్ల ఎగుమతి ఆధారిత తయారీ, ప్రాంతీయ సరఫరా వ్యవస్థలకు ఈజిప్ట్ ఒక విలువైన భాగస్వామిగా నిలుస్తోంది. ప్రతిగా భారత్ కూడా ఈజిప్టు పెట్టుబడిదారులు, ఎగుమతిదారులకు విస్తృతమైన, క్రియాశీలకమైన మార్కెట్‌ను, వేగంగా అభివృద్ధి చెందుతున్న మౌలిక సదుపాయాలను, సాంకేతిక, ఉత్పత్తి భాగస్వామ్య అవకాశాలను అందిస్తోంది.

సంయుక్త వాణిజ్య కమిటీ సమావేశంలో శ్రీ పీయూష్ గోయల్ మాట్లాడుతూ భారత్, ఈజిప్ట్ మధ్య బలమైన పరస్పర సహకారానికి అవకాశం ఉన్న అయిదు రంగాలను ప్రముఖంగా ప్రస్తావించారు. అవి ఫార్మాసూటికల్స్?ఆరోగ్య సేవలు: అందుబాటు ధరల్లో మందులు, వ్యాక్సిన్లు, వైద్య సాంకేతికతలో భారత్‌కున్న బలాలను ఉపయోగించుకోవడం. ఇంజినీరింగ-ఆటోమొబైల్స్: యంత్రాలు, వాహన విడిభాగాలు, పారిశ్రామిక తయారీ. వ్యవసాయం?ఆహార శుద్ధి: ఆహార భద్రత, ఎరువులు, నీటిపారుదల, కోల్డ్-చెయిన్ మౌలిక సదుపాయాలు. డిజిటల-ఫిన్‌టెక్: యూపీఐ అనుసంధానం, స్థానిక కరెన్సీలో వాణిజ్యం, భారత డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు. సంస్కృతి-మ్యూజియం: కళాఖండాల సంరక్షణ, నిర్వహణ, డిజిటలైజేషన్ రంగాల్లో గ్రాండ్ ఈజిప్షియన్ మ్యూజియం, భారత్‌లో ఏర్పాటు చేయనున్న యుగే యుగీన్ భారత్ జాతీయ మ్యూజియం మధ్య ప్రతిపాదిత సహకారం.

భారత-ఈజిప్టు వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఆర్థిక ప్రాధాన్యాలను ముందుకు తీసుకెళ్లే దిశగా వేసిన ముఖ్యమైన ముందడుగే మంత్రిత్వ స్థాయి జేటీసీ. 2026 సెప్టెంబర్‌లో భారత్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ ఎల్-సిసి, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీల మధ్య జరిగిన భేటీ నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ రాజకీయ సానుకూలతను బలమైన వాణిజ్య కార్యకలాపాలు, కొత్త పెట్టుబడులు, ఉమ్మడి తయారీ, మెరుగైన మార్కెట్ అవకాశాలతో పాటు భారత్, ఈజిప్ట్, విస్తృత ప్రాంతీ య మార్కెట్లను అనుసంధానించే మరింత పటిష్ఠమైన సరఫరా వ్యవస్థలుగా మార్చడానికి మార్చడానికి ఈ జేటీసీ కృషి చేస్తుంది. తదుపరి జేటీసీ సమావేశాన్ని 2028లో న్యూఢిల్లీలో లేదా అంతకంటే ముందుగా పరస్పరం అనుకూలమైన తేదీన నిర్వహించాలని నిర్ణయించారు.

భారత్-ఈజిప్ట్ వ్యూహాత్మక భాగస్వామ్యం పరిధిలో వ్యాపార సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు వేదికను అందించిన భారత్-ఈజిప్ట్ బిజినెస్ ఫోరమ్ ద్వారా భారత్, ఈజిప్ట్ దేశాలకు చెందిన 300కు పైగా కంపెనీలు ఒక్కచోట చేరాయి. వివిధ రంగాలకు చెందిన పారిశ్రామిక దిగ్గజాలు, సీనియర్ వ్యాపార ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్, ఈజిప్ట్ పెట్టుబడులు, విదేశీ వాణిజ్య శాఖ మంత్రి డాక్టర్ మొహమ్మద్ ఫరీద్ సలేహ్ ప్రసంగించారు.

2026 నవంబర్ 15 నుంచి 16 వరకు శ్రీ పీయూష్ గోయల్ ఈజిప్ట్ అధికారిక పర్యటన సందర్భంగా ఈ ఫోరమ్ నిర్వహించారు. దీని ప్రారంభ సమావేశంలో జనరల్ అథారిటీ ఫర్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫ్రీ జోన్స్ (జీఏఎఫ్ఐ) ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ మొహమ్మద్ అవాద్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) అధ్యక్షుడు, సన్మార్ గ్రూప్ ఛైర్మన్ శ్రీ విజయ్ శంకర్, ఫెడరేషన్ ఆఫ్ ఈజిప్షియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు శ్రీ అహ్మద్ ఎల్‌వాకిల్ ప్రసంగించారు. ఈ సమావేశంలో 2027లో భారత్-ఈజిప్టు మధ్య దౌత్య సంబంధాలకు 80 ఏళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో నాలుగు అంశాలతో కూడిన కార్యాచరణ అజెండాను శ్రీ గోయల్ ప్రతిపాదించారు. గుర్తించిన వాణిజ్య అడ్డంకులను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించడం, ఇన్వెస్ట్ ఇండియా సహకారంతో భారతదేశంలోని రాష్ట్రాలు, పారిశ్రామిక క్లస్టర్లలో ఈజిప్టు పెట్టుబడులను ప్రోత్సహించడం, చిన్న వ్యాపారాలకు అవకాశాలు కల్పించేందుకు పెద్ద కంపెనీల సరఫరాదారులను ఈ భాగస్వామ్యంలోకి తీసుకురావడం, పురోగతిని సమీక్షించి వ్యాపార చర్చలను వాస్తవ ఒప్పందాలుగా మార్చేందుకు వార్షిక సమీక్షలను సంస్థాగతీకరించడం లాంటి అంశాలు ఈ అజెండాలో ఉన్నాయి. "ఈ దశాబ్దం గురించి భవిష్యత్తులో ఎవరైనా అధ్యయనం చేస్తే.. మేడిన్ ఈజిప్ట్ విత్ ఇండియా, మేడిన్ ఇండియా విత్ ఈజిప్టు లేబుళ్లు ఉన్న ఫ్యాక్టరీలు వారికి కనిపించాలి" అని ఈ భాగస్వామ్య ఆశయం గురించి శ్రీ గోయల్ వివరించారు.

ఈజిప్టులో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై జరిగిన చర్చలో జీఏఎఫ్ఐ, సూయజ్ కాలువ ఆర్థిక మండలి (ఎస్‌సీజోన్) సీనియర్ ప్రతినిధులు పాల్గొన్నారు. తమ దేశంలో పారిశ్రామిక, పెట్టుబడి అవకాశాల గురించి వివరించారు. మధ్యధరా, ఎర్ర సముద్రాలను అనుసంధానించే వ్యూహాత్మక స్థానంలో ఈజిప్టు ఉండటం, ఆ దేశంలో విస్తరిస్తున్న నౌకాశ్రయాలు, లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలు, ఆఫ్రికన్, అరబ్, యూరోపియన్ మార్కెట్లతో ఉన్న అనుసంధానం భారతీయ వ్యాపార సంస్థలకు తయారీ, ఎగుమతి ఆధారిత కార్యకలాపాల్లో అవకాశాలను అందిస్తున్నాయి.

ఈజిప్టులో కార్యకలాపాలు నిర్వహిస్తున్న టీసీఐ సన్మార్, గెలాక్సీ కెమికల్, అబ్డోస్ వంటి భారతీయ కంపెనీల అనుభవాలపై కూడా ఈ ఫోరమ్‌లో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈజిప్ట్ పారిశ్రామిక ఉత్పత్తి, ఉపాధి, సాంకేతిక అభివృద్ధి, ఎగుమతులతో పాటు ప్రాంతీయ సరఫరా వ్యవస్థలతో అనుసంధానం కావడంలో భారతీయ పెట్టుబడులకు ఉన్న సామర్థ్యాన్ని ఆ సంస్థల ఉనికి స్పష్టం చేసింది. ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ పరికరాలు, రసాయనాలు, ఎరువులు, ఔషధాలు, వస్త్రాలు, ఆహార శుద్ధి, వాహన విడిభాగాలు, పునరుత్పాదక ఇంధనం, లాజిస్టిక్స్ రంగాల్లో సహకార అవకాశాలపై ఇరు దేశాల వ్యాపార వర్గాల ప్రతినిధులు చర్చించారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థపై జరిగిన ప్రత్యేక చర్చలో ఈజిప్ట్ డిజిటల్ టెక్నాలజీ, ట్రాన్స్‌ఫర్మేషన్ రంగంలో భాగస్వాములతో పాటు ప్రముఖ భారతీయ అంకురసంస్థలు, సాంకేతిక కంపెనీలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి గ్లోబల్ ఫర్ స్మార్ట్ సొల్యూషన్స్ ఛైర్మన్ ఇంజనీర్ ఐమన్ ఎల్ గోహారీ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సదస్సులో రెండు దేశాలకు చెందిన నిపుణులు, పారిశ్రామిక దిగ్గజాలు పాల్గొన్నారు. ఈజిప్ట్ తరఫున ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐటీఐడీఏ)కి చెందిన ఇంజనీర్ మహమూద్ సొఫ్రాటా, ఏజీఎక్స్ ప్రతినిధి ఫాదీ ఇస్మాయిల్, నేషనల్ సిస్టమ్‌కు చెందిన డాక్టర్ కరీమ్ హమ్జా, ఎరామ్ హోల్డింగ్స్‌కు చెందిన డాక్టర్ సిద్దీక్ అహ్మద్ హాజరయ్యారు. భారతీయ పరిశ్రమల ప్రతినిధుల్లో జోహో సంస్థకు చెందిన శ్రీ రాజేష్ రంగనాథన్, డేటామార్ఫోసిస్ సంస్థకు చెందిన శ్రీ ప్రదీప్ గిల్బిలే పాల్గొన్నారు. ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ, డిజిటల్ పరిష్కారాలు, ఆవిష్కరణలు, పారిశ్రామిక భాగస్వామ్యాల రంగాల్లో ఉన్న అవకాశాలపై ఈ చర్చలు ప్రధానంగా దృష్టి సారించాయి.

ఈ రోజు ఉదయం నూతన పరిపాలనా రాజధానిలో ఆరో ఇండియా-ఈజిప్టు సంయుక్త వ్యాపార మండలి (జేబీసీ) సమావేశం జరిగింది. దీనిలో శ్రీ గోయల్, మంత్రి సలేహ్ ప్రసంగించారు. భారత్ తరఫున టీసీఐ సన్మార్ కెమికల్స్ ఎస్ఏఈ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ గణేష్ కుమార్, ఈజిప్టు తరఫున మకరెం టెక్స్ ప్రతినిధి ఖలీద్ అబౌల్ మకరెం ఈ సమావేశానికి సంయుక్తంగా అధ్యక్షత వహించారు. ఫిక్కీ అధ్యక్షుడు శ్రీ విజయ్ శంకర్ కూడా ఈ సమావేశంలో ప్రసంగించారు. రసాయనాలు-పెట్రో కెమికల్స్, ఫార్మసూటికల్స్-ఆరోగ్యసేవలు, ఆహారశుద్ధి?అగ్రి బిజినెస్, పునరుత్పాదక ఇంధనం-గ్రీన్ హైడ్రోజన్, మౌలిక వసతులు-పోర్టులు-లాజిస్టిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ?డిజిటల్ సేవలు, టెక్స్‌టైల్స్, ఆటోమోటివ్ తయారీ సహా ప్రాధాన్య రంగాలపై దృష్టి సారించి చర్చలు జరిపే అవకాశాన్ని సంయుక్త వ్యాపార మండలి అందించింది. వ్యాపార సంస్థల మధ్య సంస్థాగత సంబంధాలను బలోపేతం చేసే మార్గాలను కూడా మండలి పరిశీలించింది. ఇందులో భాగంగా రంగాల వారీగా కార్యవర్గాలను ఏర్పాటు చేసే అవకాశం, కస్టమ్స్, వాణిజ్య సౌలభ్యం, వ్యాపార వీసాలతో పాటు 2026-27 సంవత్సరానికి పరస్పర వాణిజ్య లక్ష్యాల క్యాలెండర్ లాంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంది.

భారత్, ఈజిప్ట్ ఆర్థిక వ్యవస్థల మధ్య ఉన్న పరస్పర అనుకూలతలను ఈ రెండు సమావేశాలు ప్రధానంగా తెలియజేశాయి. విస్తృతమైన, వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌తో పాటు పోటీతత్వం గల తయారీ, ఇంజనీరింగ్, డిజిటల్ సామర్థ్యాలను భారత్ అందిస్తోంది. పటిష్ఠమైన పారిశ్రామిక పునాది, వ్యూహాత్మక అనుసంధానం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ఆఫ్రికాతో పాటు విస్తృత ప్రాంతీయ మార్కెట్లలో ప్రవేశ అవకాశాలను ఈజిప్టు అందిస్తోంది. ద్వైపాక్షిక వాణిజ్యం 6.5 బిలియన్ అమెరికన్ డాలర్లను దాటగా, ఈజిప్టులో భారతీయ పెట్టుబడులు ఇప్పటికే 5.5 బిలియన్ డాలర్లకు పైగా చేరుకున్నాయి. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు సేవలందించే విధంగా ద్వైపాక్షిక పెట్టుబడులు, ఉమ్మడి తయారీ, సాంకేతిక భాగస్వామ్యాలు, సరఫరా వ్యవస్థలను మరింత వృద్ధి చేసేందుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ఇరు పక్షాలు భావిస్తున్నాయి. 2026 సెప్టెంబర్‌లో భారత్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ ఎల్-సిసి, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీల మధ్య జరిగిన భేటీకి కొనసాగింపుగా శ్రీ గోయల్ ఈ పర్యటన చేపట్టారు. భారత-ఈజిప్టు వ్యూహాత్మక భాగస్వామ్యం పరిధిలో ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలనే రెండు దేశాల ఆకాంక్షను ఈ ఉన్నత స్థాయి పర్యటన, 300కు పైగా కంపెనీలు పాల్గొన్న భారత్-ఈజిప్ట్ బిజినెస్ ఫోరమ్, భారత్-ఈజిప్ట్ సంయుక్త వ్యాపార మండలి సమావేశాలు ప్రతిబింబిస్తున్నాయి.



# అంతర్జాతీయ భాగస్వామ్యాల పటిష్టీకరణ, పెట్టుబడుల ఆకర్షణ, భారత్‌ను ప్రపంచ తయారీ కూడలిగా నిలపడంపై దృష్టిని కేంద్రీకరించిన శిఖరాగ్ర సదస్సు

న్యూఢిల్లీ, నవంబర్ 17:భారతీయ పారిశ్రామిక రంగ సమాఖ్య (సీఐఐ) 2026 నవంబర్ 12, 13వ తేదీల్లో విశాఖపట్నంలో 'సీఐఐ 31వ భాగస్వామ్య శిఖరాగ్ర సదస్సు-2026'ను నిర్వహించింది. దీనిని "నావిగేటింగ్ ది న్యూ వరల్డ్ ఆర్డర్: ట్రేడ్ । టెక్నాలజీ । ట్రస్ట్ । థాట్ లీడర్‌షిప్" ఇతివృత్తంతో నిర్వహించారు. ఈ శిఖరాగ్ర సదస్సును కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖలో భాగమైన పరిశ్రమ, అంతర్జాతీయ వ్యాపార ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించింది. ఈ శిఖరాగ్ర సదస్సులో విధాన రూపకర్తలు, అంతర్జాతీయ ప్రతినిధులు, ప్రపంచ వ్యాపార రంగ ప్రముఖులు, ఇన్వెస్టర్లు సమావేశమయ్యారు. వారు వ్యాపారం, సాంకేతిక విజ్ఞానం, ఆర్థిక సహకారం రంగాల్లో కొత్తగా అందుబాటులోకి వస్తున్న అవకాశాలపై చర్చించారు.

ప్రారంభ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కల్యాణ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, ఆర్‌టీజీ శాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని, ప్రత్యేక ప్రసంగాన్నిచ్చారు.

ప్రారంభ కార్యక్రమంలో అనేక మంది సీనియర్ నేతలు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, విదేశీ వాణిజ్య మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, విధాన రూపకర్తలు, దేశ విదేశాలకు చెందిన పరిశ్రమ రంగాల్లోని ప్రముఖులు కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడులు, పారిశ్రామిక సహకారంతో పాటు వ్యూహాత్మక భాగస్వామ్యాలను బలోపేతం చేయడం పట్ల అనేక వర్గాలు ఆసక్తితో ఉన్నాయని చాటింది.

ఈ శిఖరాగ్ర సదస్సు.. అంతర్జాతీయ వాణిజ్యం, ప్రపంచవ్యాప్త వేల్యూ చైన్లు, ప్రతికూలతలకు తట్టుకొని నిలవగలిగిన సరఫరా వ్యవస్థలు, ఉన్నత స్థాయి తయారీ, రక్షణ రంగ సంబంధిత సాంకేతికత, కీలక ఖనిజాలు, కృత్రిమ మేధ, క్వాంటమ్ సాంకేతికతలు, స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, పర్యావరణానికి హాని చేయని ఇంధన వనరులు, రాబోయే కాలంలో ప్రజారవాణాతో పాటు సరికొత్తగా తెర మీదకు వస్తున్న సాంకేతికతలపై చర్చించడానికి ఒక వేదికను సమకూర్చింది. అంతర్జాతీయ భాగస్వామ్యాలను పటిష్టపరుచుకోవడం, పెట్టుబడులను ఆకర్షించడం, భారత్‌ను అంతర్జాతీయ తయారీ, నూతన ఆవిష్కరణల విషయాల్లో పోటీపడే దేశంగా రూపొందించడం అన్న అంశాలపై చర్చల్లో దృష్టి కేంద్రీకరించారు.

శిఖరాగ్ర సదస్సుకు విచ్చేసిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి సంస్థ (ఎన్ఐసీడీసీ) మండపాన్ని సందర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణపట్నం, ఓర్వకల్లు, కొప్పర్తిలలో ఎన్ఐసీడీసీ ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక స్మార్ట్ సిటీలకు సంబంధించిన పనులు ఎలా పురోగమిస్తోందీ సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ రజత్ కుమార్ సైనీ ప్రముఖులకు వివరించారు.

భారత్‌లో పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన రంగంలోనూ, పెట్టుబడి అవకాశాల్లోనూ చోటుచేసుకుంటున్న అనేక పరిణామాలను వివిధ కార్యక్రమాలు, డిజిటల్ వేదికల ద్వారా ఎన్ఐసీడీసీ మండపంలో ప్రదర్శించారు. ముఖ్య ఆకర్షణల్లో గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీస్, బీహెచ్‌వీవీఐ('భవ్య'.. భారత్ ఔద్యోగిక వికాస్ యోజనకు ఇది సంక్షిప్త రూపం), ఇండస్ట్రియల్ కారిడార్ ల్యాండ్ ప్లాట్‌ఫామ్ (ఐసీఎల్‌పీ), కోయ్‌లా శక్తి వంటివి ఉన్నాయి. వీటిలో ఐసీఎల్‌పీ ఇండియాలో అధికారిక గుర్తింపును కలిగి ఉన్న పారిశ్రామిక భూములను గురించి ఇన్వెస్టర్లకు తెలియజేస్తుంది. ఇక కోయ్‌లా శక్తి విషయానికి వస్తే ఇది ఒక స్మార్ట్ కోల్ ఎనలిటిక్స్ డ్యాష్‌బోర్డు. ఈ పెవిలియన్లో 360 డిగ్రీల వర్చువల్ రియాలిటీ (వీఆర్) పర్యటన సదుపాయాన్ని కూడా కల్పించారు. దీనిని సందర్శించిన వారికి, ఎన్ఐసీడీసీ పారిశ్రామిక కారిడార్ ప్రాజెక్టులను గురించిన సమగ్ర అవగాహన ఏర్పడింది.

మూడు ఇండస్ట్రియల్ నోడ్స్‌లో అభివృద్ధి పనుల క్రమాన్ని శ్రీ రజత్ కుమార్ సైనీ ప్రముఖుల దృష్టికి తీసుకువచ్చారు. వివిధ ప్రాజెక్టుల పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన తీరుతెన్నులను, రాష్ట్రంలోని పారిశ్రామిక ప్రాంతాల్లో పెట్టుబడికి అనువైన ఏర్పాట్లు చేసే దిశగా ఎన్ఐసీడీసీ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా తెలియజేశారు.

ఈ మండపం ఆంధ్రప్రదేశ్‌కున్న పారిశ్రామిక సత్తాను తెలిపింది. మూడు నోడ్లలోనూ కలిపి 7,223 ఎకరాల స్థలం ప్రాజెక్టులకు అనువుగా రూపుదిద్దుకొందని, రూ.31,360 కోట్ల విలువైన పెట్టుబడి సామర్థ్యంతో పాటు 2 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించే అవకాశం వీటికి ఉన్నాయని వివరించారు. ఈ మూడు నోడ్లను వేరువేరు ఇండస్ట్రియల్ కారిడార్లలో తీర్చిదిద్దుతున్నారు. వీటిలో ప్రపంచ శ్రేణి మౌలిక సదుపాయాలను, నందానాన్ని జతపరిచి ఏకీకృత పారిశ్రామిక విస్తారిత అనుబంధ వ్యవస్థలను (ఇకోసిస్టవ్స్) ఆవిష్కరించనున్నారు. పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆంధ్రప్రదేశ్‌కు రప్పించుకోవడం, రాష్ట్రంలో తయారీ సామర్థ్యాలను బలోపేతం చేయడం, ఉద్యోగకల్పనతో పాటు పారిశ్రామిక అభివృద్ధిని పెంపొందింపచేయడం లక్ష్యాలుగా ఈ నోడ్లను ముస్తాబు చేస్తున్నారు.

ఈ ప్రదర్శనలు, సమావేశాల ద్వారా తయారీ, వినూత్న రంగాల్లో పెట్టుబడికి ఉన్న అవకాశాలను గురించి ఎన్ఐసీడీసీ ప్రస్తావించింది.

ఆంధ్రప్రదేశ్.. దేశీయ పెట్టుబడిదారులకే కాకుండా అంతర్జాతీయ పెట్టుబడిదారులకు కూడా ఒక ఆకర్షణీయ రాష్ట్రంగా మారిందని ఎన్ఐసీడీసీ పేర్కొంది.

జపాన్ కంట్రీ సెషన్‌లో భారతదేశానికి జపాన్ రాయబారి శ్రీ కీచీ ఒనో పాల్గొన్నారు. భారతదేశానికి, జపాన్‌కు మధ్య ఆర్థిక భాగస్వామ్యం నానాటికీ విస్తరిస్తోందని ఆయన అన్నారు. 31 జపాన్ కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌లోని మూడు నగరాల్లో కార్యకలాపాలను సాగిస్తూ, స్థానికంగా 8,000కు మించిన ఉద్యోగాల్ని కల్పించాయని ఆయన తెలిపారు. ఉక్కు, ఔషధాల నిర్మాణం, స్వచ్ఛ ఇంధనం, సెమికండక్టర్ల రంగాలలో సహకారానికి అవకాశాలు ఉన్నాయని కూడా ఆయన ప్రస్తావించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు, ఆహార శుద్ధి శాఖ మంత్రి శ్రీ టి.జి. భరత్ మాట్లాడుతూ, రాష్ట్రంలో గల పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, వ్యూహాత్మకంగా కీలకమైన ఓడరేవులు, రంగంవారీ అవకాశాలను వివరించారు. పెట్టుబడితో ముడిపడిన వాగ్దానాలను వాస్తవిక ప్రాజెక్టులుగా మార్చుకోవడంపై శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు.

శ్రీ రజత్ కుమార్ సైనీ ప్రారంభోపన్యాసాన్నిస్తూ, అయిదు కీలక రంగాల్లో ఇప్పటి కన్నా మరింత ఎక్కువ సహకారాన్ని ఆశిస్తున్నట్లు ప్రస్తావించారు. అవి తయారీ, పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, సవాళ్లు ఎదురైనా తట్టుకొని నిలవగలిగే సరఫరా వ్యవస్థలు, ఉన్నత సాంకేతికతలు, దీర్ఘకాలిక ప్రాతిపదికన పారిశ్రామికాభివృద్ధి సాధన, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వాణిజ్య వ్యవస్థ (ఎమ్ఎస్ఎమ్ఈ) భాగస్వామ్యాలు, నైపుణ్యాభివృద్ధి రంగాలు అని ఆయన వివరించారు. పెట్టుబడికి ఉన్న అవకాశాలను ఆచరణీయ భాగస్వామ్యాలుగా మలచుకోవడం ముఖ్యమనీ, రాబోయే పది సంవత్సరాల్లో భారతదేశంలో పది లక్ష కోట్ల జపనీస్ యెన్ (10 ట్రిలియన్ జేపీవై) విలువ గల పెట్టుబడులు పెట్టాలన్న ఆసక్తిని జపాన్ కనబరిచిందనీ ఆయన అన్నారు.

జేఈటీఆర్ఓ చెన్నయి డైరెక్టర్ జనరల్ శ్రీ కియోటకా దొహో మాట్లాడుతూ భారత్‌లోనూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ జపాన్ కంపెనీల ఆసక్తి అంతకంతకూ పెరుగుతోందన్నారు. సర్వే చేసిన కంపెనీల్లో 80 శాతం కంపెనీలు ఇక్కడ తమ కార్యకలాపాలను విస్తరించేందుకు పథక రచన చేస్తున్నాయని తేలిందని ఆయన తెలిపారు. ఇసుజు మోటర్స్ ఇండియా ప్రెసిడెంటు, మేనేజింగ్ డైరెక్టరు శ్రీ రాజేశ్ మిత్తల్ మాట్లాడుతూ, జపాన్లో తయారీ కంపెనీలు పాటించే పద్ధతులు, నాణ్యతా ప్రమాణాలు, నైపుణ్యాభివృద్ధి, స్థానికంగా సరఫరాదారు వ్యవస్థ సేవలను వినియోగించుకొనేందుకు ప్రాధాన్యాన్ని ఇస్తున్నాయన్నారు.

అనేక పారిశ్రామిక కారిడార్లలో కొత్త పారిశ్రామిక స్మార్ట్ నగరాలను ఎన్ఐసీడీసీ అభివృద్ధి చేయడం ద్వారా భారతదేశ తయారీ విస్తారిత అనుబంధ వ్యవస్థ (ఇకోసిస్టమ్)ను బలోపేతం చేయడం, ఆధునిక రవాణా వ్యవస్థ (లాజిస్టిక్స్) సామర్థ్యాన్ని పెంపొందింప చేయడంతో పాటు పెట్టుబడులకు అనువైన పారిశ్రామిక క్షేత్రాలను సన్నద్ధం చేసే దిశగా కృషి చేస్తోంది. దేశ, విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తూ, ఉద్యోగకల్పనకు తోడ్పడాలని, భారతీయ పరిశ్రమలను గ్లోబల్ వేల్యూ చైన్లతో ఏకీకరించే ప్రక్రియకు మార్గాన్ని సుగమం చేయాలనే లక్ష్యాలను ఎన్ఐసీడీసీ నిర్దేశించుకొని అనేక కార్యక్రమాలను అమలుచేస్తోంది.

కార్యక్రమంలో పాలుపంచుకున్న ఇతర ప్రముఖులలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు, ఆహార శుద్ధి శాఖ మంత్రి శ్రీ టి.జి. భరత్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి శ్రీ బి.సి. జనార్ధన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ జి. సాయి ప్రసాద్, సీఐఐ అధ్యక్షుడు, టాటా కెమికల్స్ మేనేజింగ్ డైరెక్టరు, సీఈఓ శ్రీ ఆర్. ముకుందన్‌తో పాటు సీఐఐ డైరెక్టర్ జనరల్ శ్రీ చంద్రజిత్ బెనర్జీ ఉన్నారు.

సీఐఐ 31వ భాగస్వామ్య సదస్సు-2026లో ఎన్ఐసీడీసీ పాల్గొనడంతో ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టుల్లో సంస్థ సాధిస్తున్న పురోగతిని సందర్శకులకు వివరించే అవకాశాన్ని సంపాదించుకోవడం ఒక్కటే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడి పెట్టడానికి గల అవకాశాలను అంతర్జాతీయ స్థాయి ఆసక్తిదారు వర్గాల దృష్టికి తీసుకువెళ్లేందుకు వీలు కలిగింది. ఈ ప్రయత్నాలు దేశంలో తయారీ రంగం శక్తిసామర్థ్యాలను పటిష్టపరిచి, 2047 కల్లా 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్) లక్ష్యాన్ని సాధించే దిశగా పయనించాలన్న కేంద్ర ప్రభుత్వ దార్శనికతను సాకారం చేయడంలో తోడ్పాటును అందించనున్నాయి.






# పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణ స్పందన ఉండాలి

**పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి**
**త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ తనిఖీలో సీపీ సునీల్ దత్**

ఖమ్మం, నవంబర్ 17: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందిస్తూ, బాధితులకు చట్టపరిధిలో న్యాయం అందించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించారు. సోమవారం ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన స్టేషన్‌లోని రికార్డులు, నిర్వహణ తీరును క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా రిసెప్షన్ విభాగాన్ని పరిశీలించి ఫిర్యాదుల స్వీకరణ, నమోదు, పరిష్కారానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని చట్టప్రకారం తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించడంతోపాటు పెండింగ్ ఫిర్యాదులు, కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విధుల నిర్వహణలో క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పనితీరు తప్పనిసరిగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీసుల పనితీరును సమీక్షిస్తూ ప్రతి అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు.

ముఖ్యంగా సెక్టార్ అధికారుల బాధ్యతలను వివరిస్తూ, తమ పరిధిలోని ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల గుర్తింపు, సమస్యాత్మక ప్రాంతాల పర్యవేక్షణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ క్షేత్రస్థాయిలో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.

ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి పాల్గొన్నారు.

# ఖేలో ఇండియా కోసం పాలమూరు సిద్ధం..

**ఈ నెల 25లోగా ఏర్పాట్లు పూర్తి చేయాలి**
**మహబూబ్‌నగర్‌లో కబడ్డీ పోటీలు.. ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి వాకిటి శ్రీహరి**

మహబూబ్‌నగర్, నవంబర్ 17జాతీయ స్థాయి క్రీడా పోటీలకు పాలమూరు ముస్తాబవుతోంది. డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరగనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో భాగంగా మహబూబ్‌నగర్‌లో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

స్టేడియం అభివృద్ధి పనులు, టాయిలెట్ బ్లాక్ నిర్మాణాలను తనిఖీ చేసిన మంత్రి.. ఈ నెల 25లోగా పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పించాలని, నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా సుమారు 8 వేల మంది క్రీడాకారులు, 1,500 మంది కోచ్‌లు పాల్గొననున్నట్లు మంత్రి తెలిపారు. క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.226 కోట్లకు పైగా నిధులు కేటాయించాయని పేర్కొన్నారు. క్రీడాకారులు, కోచ్‌లకు వసతి, భోజనం, రవాణా సదుపాయాలు మెరుగ్గా కల్పించాలని రాష్ట్ర క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి సూచించారు.

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ నిర్దేశిత గడువులోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, జిల్లా ఎస్పీ డి. జానకి, మేయర్ జి. మమత, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ హాస్టల్‌లో విషాదం.. విద్యార్థి ఆత్మహత్య

నల్గొండ, నవంబర్ 17: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. రెండో సంవత్సరం చదువుతున్న గండికోట జగదీష్ హాస్టల్ గదిలో మృతి చెందాడు.

రంగారెడ్డి జిల్లా మాడుగుల గ్రామానికి చెందిన జగదీష్ మంగళవారం మధ్యాహ్నం విద్యార్థులు భోజనం చేస్తున్న సమయంలో గదిలోకి వెళ్లి ఉరివేసుకున్నట్లు సమాచారం. గమనించిన తోటి విద్యార్థులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా, అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

# బాధితుడికి ఎంపీ రఘురామిరెడ్డి పరామర్శ

**లక్ష్మీనర్సయ్య ఆరోగ్య పరిస్థితిపై ఆరా..**
**కుటుంబానికి అండగా ఉంటానని భరోసా**



ఖమ్మం, నవంబర్ 17: లక్ష్మీదేవిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు పూజెం శ్రీనివాస్ తండ్రి లక్ష్మీనర్సయ్యను ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి పరామర్శించారు. ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన లక్ష్మీనర్సయ్య కుడికాలికి శస్త్రచికిత్స చేయించుకున్నారు.

ఈ విషయం తెలుసుకున్న ఎంపీ ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో పార్టీ పరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటానని భరోసా కల్పించారు.

కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, కోనేరు చిన్ని, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగసీతారాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెదబాబు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేవరగట్ల ప్రసాద్, సర్పంచ్ తాటి అనిత, అజ్మీరా లైలా, ఉపసర్పంచ్ వద్దెం నతీష్, చావాల పురుషోత్తం, తాటి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

# 57వ ఇఫిలో ఐసీఎఫ్‌టీ-యునెస్కో గాంధీ మెడల్ కోసం పోటీపడనున్న 10 చిత్రాలు

న్యూ ఢిల్లీ, నవంబర్ 17: 2026 నవంబర్ 20 నుంచి 28 వరకు గోవాలో జరగనున్న 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫి)లో ప్రతిష్టాత్మకమైన ఐసీఎఫ్‌టీ-యునెస్కో గాంధీ మెడల్ కోసం పది భారతీయ, అంతర్జాతీయ కల్పిత కథా చిత్రాలు పోటీపడనున్నాయి. ఈ చిత్రాలు శాంతి, సహనం, సానుభూతి, సామాజిక న్యాయం, విభిన్న సంస్కృతుల మధ్య సంభాషణ వంటి ఇతివృత్తాలను ఆవిష్కరిస్తాయి. ఈ ఏడాది ఉత్సవ ప్రధాన ఇతివృత్తమైన 'సరిహద్దులు లేని కథలు'కు అనుగుణంగా ఈ చిత్రాలను ఎంపిక చేశారు.

యునెస్కో ఆధ్వర్యంలో పారిస్‌లోని అంతర్జాతీయ చలనచిత్ర, టెలివిజన్, ఆడియోవిజువల్ కమ్యూనికేషన్ మండలి (సీఐసీటీ?ఐసీఎఫ్‌టీ) సహకారంతో 46వ ఇఫిలో ఈ అవార్డును ప్రవేశపెట్టారు. అహింస, సహనం, అంతర్ సాంస్కృతిక అవగాహన, శాంతి సంస్కృతి వంటి మహాత్మా గాంధీ ఆదర్శాలను ప్రతిబింబించే చిత్రాలకు ఈ పురస్కారాన్ని అందజేస్తారు.

నలుగురు సభ్యులతో కూడిన అంతర్జాతీయ జ్యూరీకి అల్జీరియాకు చెందిన ప్రొఫెసర్ (డాక్టర్) అహ్మద్ బెడ్జాయి నేతృత్వం వహించనున్నారు. ఆయన విశ్వవిద్యాలయ ఆచార్యుడిగా, చలనచిత్ర దర్శకుడిగా, నిర్మాతగా, సినీ విమర్శకుడిగా సేవలందిస్తున్నారు. జ్యూరీలోని ఇతర సభ్యులు అర్జెంటీనా/ఫ్రాన్స్‌కు చెందిన మరియా క్రిస్టినా ఇగ్లేసియాస్, యునెస్కో సాంస్కృతిక విభాగంలో గతంలో ప్రోగ్రామ్ అధిపతిగా పనిచేశారు. లక్సెంబర్గ్‌కు చెందిన జార్జెస్ డుపాంట్, సీఐసీటీ?ఐసీఎఫ్‌టీ మాజీ డైరెక్టర్ జనరల్, భారత్‌కు చెందిన అంతర్జాతీయ ప్రశంసలు పొందిన చలనచిత్ర దర్శకుడు, ఐసీఎఫ్‌టీ సభ్యుడు మనోజ్ కదామ్ ఉన్నారు.

ఈ ఏడాది పోటీకి ఎంపికైన పది చిత్రాలు విభిన్న సాంస్కృతిక నేపథ్యాల నుంచి వచ్చిన కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాయి. మానవ సంబంధాలు, సామాజిక సవాళ్లు, ఉమ్మడి విలువలను ఈ చిత్రాలు ప్రతిబింబిస్తాయి.

అంతర్జాతీయ చిత్రాల విభాగంలో ఎమిలీ అతెఫ్ దర్శకత్వం వహించిన 'కాల్ మీ క్వీన్' ఉంది. జర్మనీ, ఫ్రాన్స్, యూకే, కెన్యా సంయుక్త నిర్మాణమైన ఈ చిత్రం 1990వ దశకంలోని నైరోబీ నేపథ్యంలో సాగుతుంది. ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ, సామాజిక అన్యాయాన్ని ఎదుర్కొంటున్న ఓ ఒంటరి తల్లి, అనూహ్యంగా ఏర్పడిన స్నేహం ద్వారా ఎలా ధైర్యాన్ని పొందిందన్నది ఈ చిత్ర కథాంశం. ఇఫిలో ఈ చిత్రం తొలిసారిగా భారత్‌లో ప్రదర్శితం కానుంది.

భారత్ తరఫున మూడు చిత్రాలు పోటీలో నిలిచాయి. సర్వరాజ్ ఆలం దర్శకత్వం వహించిన 'కబీర్ సర్ కా ఆఖీ లెసన్' (కబీర్ సర్) చిత్రంలో వినయ్ పాఠక్ ప్రధాన పాత్ర పోషించారు. సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న ప్రస్తుత కాలంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సవాళ్లను ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది. ఈ చిత్రం ప్రపంచ ప్రీమియర్‌గా ప్రదర్శితం కానుంది. కన్నన్ ఎస్ దర్శకత్వం వహించిన 'స్క్రోల్' చిత్రం స్మార్ట్‌ఫోన్ వ్యసనాన్ని ఇతివృత్తంగా తీసుకుంది. స్క్రీన్ వినియోగ సమయాన్ని నియంత్రించేందుకు యాప్ ఆధారిత గేమ్‌ను ఉపయోగించే ఓ యువకుడి కలవరపరిచే అనుభవాల ద్వారా ఈ అంశాన్ని చూపిస్తుంది. ముస్కాన్ అస్తానా తొలి దర్శకత్వ చిత్రమైన 'సేవ్ మిచ్చర్'.. ఆర్థిక, వ్యక్తిగత సమస్యలను ఎదుర్కొంటున్న ఓ దుకాణదారుడి కథ ద్వారా కుటుంబంలో తలెత్తే ఉద్రిక్తతలు, పోటీ, తిరిగి సఖ్యత సాధించడం వంటి అంశాలను ఆవిష్కరిస్తుంది.

హైతీ, ఫ్రాన్స్, బెల్జియం, లక్సెంబర్గ్, కెనడా సంయుక్త నిర్మాణమైన 'మేరీ మడేలీన్' చిత్రానికి జెస్సికా జెనియస్ దర్శకత్వం వహించారు. స్వతంత్ర భావాలున్న ఓ మహిళకు, యువ సువార్తికుడికి మధ్య క్రమంగా అభివృద్ధి చెందే సంబంధం ద్వారా విశ్వాసం, సామాజిక సంప్రదాయాలు, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి అంశాలను ఈ చిత్రం చర్చిస్తుంది. 2026 ఫెస్టివల్ డి కాబోర్గ్‌లో ఈ చిత్రం గ్రాండ్ ప్రిక్స్ డ్యూ జ్యూరీ అవార్డును గెలుచుకుంది. ఇఫిలో ఆసియా ప్రీమియర్‌గా ప్రదర్శితం కానుంది.

ఘనా-అమెరికన్ చిత్రనిర్మాత అమర్తేయ్ ఆర్మర్ దర్శకత్వం వహించిన 'అవర్ టైమ్ విల్ కమ్ (ఈగో రీచ్ వీ ఆల్)' చిత్రం, తల్లిదండ్రి కోసం అక్రాకు ప్రయాణించే ఇద్దరు అనాథల కథను చెబుతుంది. 2026 లోకార్నో చలనచిత్రోత్సవంలో ఈ చిత్రం 'పార్డో ఫర్ చేంజ్', 'పార్డో ఫర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్' అవార్డులను గెలుచుకుంది. ఇఫిలో ఆసియా ప్రీమియర్‌గా ప్రదర్శితం కానుంది.

టర్కీ చిత్రనిర్మాత ఫైసల్ సోయ్సల్ దర్శకత్వం వహించిన 'రహ్మా' చిత్రం ఓ పురావస్తు శాస్త్రవేత్త కథను చెబుతుంది. తొమ్మిదేళ్ల సిరియా అనాథ బాలికతో ఆమెకు అనూహ్యంగా ఏర్పడిన అనుబంధం భావోద్వేగ సంక్షోభానికి దారితీయడంతోపాటు, జీవితాన్ని చూసే ఆమె దృక్పథంలో మార్పు తీసుకొస్తుంది. ఈ చిత్రం ఇఫిలో ఆసియా ప్రీమియర్‌గా ప్రదర్శితం కానుంది.

లైలా మర్రాక్కి దర్శకత్వం వహించిన 'స్ట్రాబెర్రీస్' (లా మాస్ దుల్సే) చిత్రం స్పెయిన్‌లో కాలానుగుణంగా స్ట్రాబెర్రీల సేకరణ పనులు చేసే ఇద్దరు మొరాకో మహిళల కథను చెబుతుంది. పని ప్రదేశంల

# "తక్కువ గందరగోళం.. ఎక్కువ వార్తలు.. తక్కువ సంచలనం.. ఎక్కువ బాధ్యత": శ్రీ రజత్ శర్మ




న్యూఢిల్లీ, నవంబర్ 17:కేంద్ర సమాచార, ప్రసార, రైల్వేలు, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికశాఖల మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ నేడు న్యూఢిల్లీలోని ఆకాశవాణి భవన్‌లోని రంగ్‌భవన్ ఆడిటోరియంలో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ పత్రికా దినోత్సవ వేడుకల్లో పాల్గొని, ప్రసంగించారు.

ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న ఆయన.. వేగంగా మారుతున్న మీడియా రంగానికి, సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా మీడియా నిపుణులు తమను తాము మలచుకోవాలని పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన జర్నలిజం పాటించాల్సిన ఆవశ్యకతను, సమాజం పట్ల మీడియాకు ఉన్న బాధ్యతను ఆయన తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ జస్టిస్ (రిటైర్డ్) రంజనా ప్రకాశ్ దేశాయ్, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ చంచల్ కుమార్, ప్రముఖ పాత్రికేయుడు రజత్ శర్మ, పీసీఐ సభ్యుడు డాక్టర్ సుధాన్షు త్రివేది పాల్గొన్నారు. ఈ ఏడాది 'జర్నలిజం: ప్రజాకర్షకమా? బాధ్యతాయుతమైనదా?' అనే ఇతివృత్తం.. సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతున్న, డిజిటల్ ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత కాలంలో జర్నలిజం మారుతున్న పాత్రను ప్రతిబింబించింది.

పౌరులకు సాధికారత కల్పించి, సమాజాన్ని బలోపేతం చేసేందుకు సమష్టి కృషి అవసరం: శ్రీ అశ్విని వైష్ణవ్

సభికులను ఉద్దేశించి శ్రీ అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంలో అపూర్వమైన వేగంతో మార్పులు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. గత రెండు దశాబ్దాల్లో వచ్చిన మార్పులకంటే ఎక్కువ మార్పులు రాబోయే అయిదేళ్లలో చోటుచేసుకునే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. మార్పులను స్వాగతిస్తూ, తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరచుకోవాలని యువ పాత్రికేయులకు సూచించారు.

డిజిటల్ వేదికల జవాబుదారీతనాన్ని ప్రస్తావిస్తూ.. తప్పుడు సమాచారం, డీప్‌ఫేక్‌లు, తప్పుదారి పట్టించే ప్రకటనలు, డిజిటల్ అరెస్టులు, చిన్నారులపై ప్రభావం చూపే హానికరమైన కంటెంట్ పెరుగుతున్న నేపథ్యంలో కేవలం కమ్యూనిటీ మార్గదర్శకాలు సరిపోతాయా? అని ఆయన ప్రశ్నించారు. పౌరులకు సాధికారత కల్పించడంతోపాటు, కొత్తగా ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించేందుకు మారుతున్న మీడియా రంగాన్ని ఏ విధంగా నియంత్రించాలనే అంశంపై చర్చించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

సంచలనాత్మకతకు, బాధ్యతాయుత జర్నలిజానికి మధ్య సన్నని గీత ఉంది: శ్రీ రజత్ శర్మ

శ్రీ రజత్ శర్మ మాట్లాడుతూ.. సంచలనాత్మకతకు, బాధ్యతాయుత జర్నలిజానికి మధ్య చాలా సన్నని గీత ఉందని పేర్కొన్నారు. సంపాదకీయ విచక్షణ, బాధ్యతాయుతమైన వార్తా కథనాల ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు. అత్యవసర పరిస్థితి, 26/11 ముంబై ఉగ్రదాడులు, ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎదురైన అనుభవాలను గుర్తుచేసుకుంటూ.. ముఖ్యంగా జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలపై వార్తలు అందించేటప్పుడు నియంత్రణ, సమాచార నిర్ధారణ, సున్నితత్వం పాటించాల్సిన అవసరాన్ని ఆయన తెలిపారు. డిజిటల్ మీడియా వ్యవస్థలో మరింత జవాబుదారీతనం ఉండాలని పిలుపునిస్తూ.. సంచలనాత్మకత కంటే కచ్చితత్వానికి పాత్రికేయులు ప్రాధాన్యమివ్వాలని కోరారు. ''తక్కువ గందరగోళం.. ఎక్కువ వార్తలు.. తక్కువ సంచలనం.. ఎక్కువ బాధ్యత'' అనే సందేశంతో తన ప్రసంగాన్ని ముగించారు.

పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ, పాత్రికేయ ప్రమాణాల మెరుగుదలకు కట్టుబడి ఉన్నాం: పీసీఐ చైర్‌పర్సన్

పీసీఐ ఛైర్‌పర్సన్ జస్టిస్ (రిటైర్డ్) శ్రీ రంజనా ప్రకాశ్ దేశాయ్ మాట్లాడుతూ.. పత్రికా స్వేచ్ఛను పరిరక్షించడంతోపాటు పాత్రికేయ ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కౌన్సిల్ కట్టుబడి ఉందని తెలిపారు. మీడియా రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులను ప్రస్తావిస్తూ.. సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి కారణంగా కేవలం కొన్ని సెకన్లలోనే లక్షలాది మందికి సమాచారం అందుబాటులోకి వస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఫోన్, ఇంటర్నెట్ కనెక్షన్ ఉన్న ఎవరైనా వార్తలను వ్యాప్తి చేయగలుగుతున్నారని, అయితే వార్తలు అందించే వారందరికీ పాత్రికేయ నైతిక విలువలపై శిక్షణ ఉండటం లేదని, వాటికి కట్టుబడి ఉండటం లేదని ఆమె అభిప్రాయపడ్డారు.

కృత్రిమ మేధ యుగంలో వార్తల కచ్చితత్వం, సంపాదకీయ విచక్షణ, మానవ జవాబుదారీతనం కీలకం: శ్రీ చంచల్ కుమార్

సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి చంచల్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజల ఆసక్తిని ఆకర్షించడంతోపాటు విశ్వసనీయతను కాపాడుకునేలా జర్నలిజం నమతుల్యత పాటించాలని అన్నారు. ప్రజాదరణకు సత్యం కంటే ప్రాధాన్యం ఇవ్వకూడదని, వైరల్ కావడాన్ని సమాచార నిర్ధారణ కంటే ముఖ్యమైనదిగా చూడకూడదని పేర్కొన్నారు. టీఆర్పీలు, క్లిక్‌లు, డిజిటల్ మాధ్యమాల్లో ప్రజల స్పందన ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో సంపాదకీయ విచక్షణ, వాస్తవాల పరిశీలన, వార్తలకు-అభిప్రాయాలకు మధ్య తేడాను గుర్తించడం ఎంతో ముఖ్యమని చెప్పారు. కృత్రిమ మేధ జర్నలిజానికి సహకరించగలదని, కానీ ఒక పాత్రికేయుడి బాధ్యతను మాత్రం అది చేపట్టలేదని స్పష్టం చేశారు.

ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ సుధాన్షు త్రివేది మాట్లాడుతూ.. అంతర్జాతీయ సూచీలను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అభివృద్ధి దిశగా భారత్ నూతన పంథాలో ముందుకు సాగుతున్న తరుణంలో నిజాయతీ, బాధ్యతాయుతంగా సమాచారాన్ని వ్యాప్తి చేయడం ఎంతో అవసరమని ఆయన స్పష్టం చేశారు. స్వేచ్ఛాయుత, బాధ్యతాయుత వార్తా ప్రసారాన్ని నిర్ధారించేందుకు ప్రింట్ మీడియా కోసం అంతర్గత స్వీయ నియంత్రణ వ్యవస్థను అందించాలనే లక్ష్యంతో, పార్లమెంటు చట్టం ద్వారా 1966లో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పాక్షిక న్యాయ సంస్థగా ఏర్పాటైంది. 1979లో దీనిని పునరుద్ధరించారు. అప్పటి నుంచి దేశంలోని పత్రికలు, వార్తా సంస్థల ప్రమాణాలను పెంపొందించడంతోపాటు పత్రికా స్వేచ్ఛను పరిరక్షించేందుకు, కాపాడేందుకు కౌన్సిల్ నిరంతరం కృషి చేస్తోంది.

# లాడ్జిలో గిరిజన యువకుడి మృతి..

ఖమ్మం, నవంబర్ 17: భద్రాచలంలోని ఓ లాడ్జిలో అర్ధరాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. లాడ్జి సిబ్బంది దాడిలో గిరిజన యువకుడు శరత్ (24) మృతి చెందాడు. లాడ్జి సిబ్బందికి, ముగ్గురు గిరిజన యువకులకు మధ్య తలెత్తిన వివాదం చివరకు హత్యకు దారితీసినట్లు తెలుస్తోంది.

లాడ్జికి సంబంధించిన వ్యక్తి శరత్‌పై దాడికి పాల్పడినట్లు సమాచారం. లాడ్జి సిబ్బంది కొట్టడంతో శరత్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో అతడిని భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే శరత్ మృతి చెందాడు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివాదానికి గల కారణాలు, దాడిలో ఎవరెవరు పాల్గొన్నారనే అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు.

# ఆరేళ్లుగా నిలిచిన రోడ్డు పనులు..

**కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి**
**బెజ్జంక-బేగంపేట డబుల్ రోడ్డు నిర్మాణంలో జాప్యంపై సీపీఐ ఫిర్యాదు**

మెదక్, నవంబర్ 17: బెజ్జంకి నుంచి బేగంపేట గ్రామానికి వెళ్లే డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి ఆరేళ్లకు పైగా నిలిపివేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి పేదలు, మహిళలు, చేనేత కార్మికులు,గీత కార్మికులు తదితర వృత్తిదారుల సంక్షేమానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఆర్టీసీ బస్సులు అందిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4.5 లక్షల మందికి చేయూత పింఛన్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే గంద్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. భూపాలపల్లి నియోజక వర్గంలో సుమారు 6,536 మందికి కొత్తగా చేయూత పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. పింఛన్ల మంజూరులో ఎవరైనా లంచం అడిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్హత ఉండి పింఛన్ రాని వారు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. భూపాలపల్లి అభివృద్ధికి రూ.73 కోట్ల నిధులు తీసుకొచ్చామని, విద్య, వైద్యం, రహదారులు, సాగునీటి రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# చేయూత పింఛన్లు పేదల జీవితాల్లో వెలుగులు

**455 మందికి చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు**
**33 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ– పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**



మహబూబ్‌నగర్, నవంబర్ 17నూతన ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చేయూత పింఛన్లు పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపినట్టుగా ఉందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం దేశాయవల్లి లోని పల్లవి ఆడిటోరియంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన చేయూత పింఛన్లకు అర్హులైన,455 మంది లబ్ధిదారులకు నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.

అలాగే వివిధ గ్రామాలకు చెందిన 33 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా మంజూరైన పింఛన్ల నగదు ఈ నెల 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు.రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలు, మహిళలు, చేనేత కార్మికులు,గీత కార్మికులు తదితర వృత్తిదారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు.

అనంతరం చౌదర్‌పల్లి గ్రామంలో నూతన అంగన్వాడి కేంద్రాన్ని, డ్వాక్రా భవనాన్ని గ్రామ సర్పంచ్ సుంకిరెడ్డి అనూష సతీష్ రెడ్డి తో కలిసి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, తాసిల్దార్ విద్యాసాగర్ రెడ్డి, ఎంపీడీవో నరేందర్ రెడ్డి, ఏవో నరేందర్, మండల ఏపిఎం నిర్మల రెడ్డి, సిడిపిఓ రూప, అనంతయ్య గుప్తా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ,సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు రామ్ లాల్,మాజీ ఎంపీపీ శాంతి,సూపర్వైజర్ మల్లమ్మ, డైరెక్టర్ ముకుందం, వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 57వ ఇఫీ వేదికపై మరాఠీ సినీ వైభవం

న్యూఢిల్లీ, నవంబర్ 17:భారతీయ ప్రధాన స్రవంతి హిందీ చలనచిత్ర పరిశ్రమకు కేంద్రంగా ఉన్న ముంబయి.. బాలీవుడ్‌తో సమానంగా ఉత్తేజకరంగా దూసుకుపోతున్న మరాఠీ సినీ సంప్రదాయానికి కూడా నిలయమై వెలుగొందుతోంది. చక్కని కథనాలు, వాస్తవిక దృక్పథం, బలంగా వేళ్లనుకున్న సాహిత్య విలువలతో మరాఠీ సినిమా ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది. ఘనమైన చలనచిత్ర వారసత్వాన్ని నగర్వంగా ప్రకటించేలా మరాఠీ సినీ వైవిధ్యాన్ని ప్రదర్శించేందుకు 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ) వేదికగా నిలవబోతున్నది. చిరతరమైన ఈ సినీ వరంపరను వేడుకగా చేసుకొనే తరుణమిది. సమకాలీన ఫీచర్, నాన్ ఫీచర్ చిత్రాల ప్రదర్శనతోపాటు సినీ దిగ్గజాలను స్మరించుకుంటూ కార్యక్రమం ఆసాంతం మరాఠీ సినిమా ఘనతను బలంగా చాటబోతున్నది.

ఈ ఏడాది ఇఫీ వేడుకల్లోని 'ఇండియన్ పనోరమా' విభాగానికి ఏడు మరాఠీ చిత్రాలు ఎంపికయ్యాయి. వాటితోపాటు శతజయంతి నివాళి విభాగంలో భాగంగా ఒక ప్రఖ్యాత క్లాసిక్ చిత్రాన్ని (పునరుద్ధరించబడిన రూపంలో), 'గాలా ప్రీమియర్స్' విభాగంలో మరో మరాఠీ చిత్రాన్ని కూడా ప్రదర్శిస్తారు.

ఫీచర్ చిత్రాల విభాగంలో ఎంపికైన మహేశ్ లిమాయే దర్శకత్వం వహించిన 'ఆది అనంత్' ఒక వర్ధమాన నటుడికి, అతడి తాతకు మధ్య ఉండే సున్నితమైన భావోద్వేగ బంధాన్ని ఆవిష్కరిస్తుంది. పెద్దవారి సంరక్షణలో ఎదురయ్యే సవాళ్లను, కుటుంబ బాధ్యతలను, అలాగే నిజమైన విజయమంటే ఏమిటో కళ్లకు కట్టినట్లు చూపే ఈ చిత్రంలో అశోక్ సరాఫ్, సంకర్షణ్ కర్హాడే, సఖి గోఖలే, యోగేశ్ శిర్సాట్ ప్రధాన పాత్రలు పోషించారు.

ఇండియన్ పనోరమాలోని ప్రధాన స్రవంతి చిత్రాల విభాగంలో విభిన్న కథాంశాలతో కూడిన రెండు చిత్రాలు ప్రదర్శితం కానున్నాయి. ప్రవీణ్ విఠల్ తర్డే రచించి, దర్శకత్వం వహించిన 'దేవల్ బండ్ 2'.. రైతు అయిన భర్తను కోల్పోయిన ఒక మహిళ కథ ద్వారా వ్యవసాయ రంగ సంక్షోభాన్ని హృద్యంగా ఆవిష్కరిస్తుంది. అలాగే సమీర్ తివారీ దర్శకత్వం వహించిన 'బాప్యా'.. స్వగ్రామానికి తిరిగొచ్చిన ట్రాన్స్‌జెండర్ కథానాయకుడి జీవితాన్ని వివరిస్తుంది. ఈ చిత్రం కుటుంబ బంధాలు, లింగవరమైన గుర్తింపు అంశాలను సమర్థంగా మేళవించింది.

ఇఫీలో భారతీయ ఫీచర్ చిత్రాలకు సంబంధించి.. 'ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు' విభాగంలో ఎంపికైన చిత్రాల్లో జీజీవిషా కాలే దర్శకత్వం వహించిన 'తిఫీ' ఒకటి. హృదయాన్ని కదిలించే ఈ కుటుంబ కథా చిత్రం మానవ సంబంధాలు, త్యాగం, బయటకు చెప్పలేని భావోద్వేగాల తాలూకు వేదనను బలంగా ఆవిష్కరించడం ఈ చిత్ర విశేషం.

వైవిధ్యమైన కథాంశాలతో కూడిన మరో మూడు మరాఠీ చిత్రాలు.. ఇండియన్ పనోరమా నాన్ ఫీచర్ విభాగంలో ప్రదర్శితం కాబోతున్నాయి. అమిత్ పట్కర్ దర్శకత్వం వహించిన 'పనిష్‌మెంట్'... ఒకదానికొకటి ఎలాంటి సంబంధమూ లేనట్టుగా అనిపించే రెండు దొంగతనాల వల్ల కలిగిన అపరాధ భావనను, దాని పరిణామాలను విశ్లేషిస్తుంది. సంతోష్ దవఖర్ తెరకెక్కించిన 'స్కై ట్రీ' (అభల్-వృక్ష్).. కరువు పరిస్థితుల మధ్య ఒక గ్రామీణుడి ఆశలను ప్రతిబింబిస్తుంది. అలాగే నిపుణ్ ధర్మాధికారి దర్శకత్వం వహించిన 'ది మూన్' (చందోబా).. విటిలిగో సమస్యతో పోరాడుతున్న ఒక యువకుడి ఇబ్బందులను, ఆ పరిస్థితి పట్ల సమాజం చూపే వివక్షను కళ్లకు కడుతుంది.

ఇండియన్ పనోరమా విభాగంలో ఎంపికలతోపాటు.. జాతీయ అవార్డు గ్రహీత దీపక్ గవాడే దర్శకత్వం వహించిన 'తు ఆహెస్ నా' చిత్రం గాలా ప్రీమియర్స్ విభాగంలో ప్రదర్శితం కానుంది. ఈ చిత్రం దుఃఖం, ఏకాంతం, వ్యక్తిగత గుర్తింపు వంటి సున్నితమైన అంశాలను స్పృశిస్తూ.. జీవితానికి అసలైన అర్థాన్ని చేకూర్చే అనూహ్య మానవ సంబంధాల గొప్పతనాన్ని ఆవిష్కరిస్తుంది.

మరాఠీ కథాకథనం కేవలం సినిమాలకే పరిమితం కాకుండా.. ఇఫీలోని ఉత్తమ వెబ్ సిరీస్ విభాగంలోనూ స్థానాన్ని సంపాదించుకుంది.

# భూపాలపల్లి నియోజకవర్గంలో 6,536 మందికి కొత్త పింఛన్లు

**మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం.. ఎంపీ కడియం కావ్య**




వరంగల్, నవంబర్ 17: పేదలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సమావేశ మందిరంలో నూతన చేయూత పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే గంద్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ అందజేశారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పలు

# అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించాలి: ఎమ్మెల్యే పల్లా

**ఆంక్షల పేరుతో అన్యాయం చేయొద్దు.. ఎన్నికల హామీ మేరకు పింఛన్ రూ.4 వేలకు పెంచాలి**



వరంగల్, నవంబర్ 17: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. మంగళవారం జనగామ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 716 మంది లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలు అందజేశారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆంక్షల పేరుతో నిజమైన అర్హులకు అన్యాయం చేయొద్దని అధికారులకు సూచించారు. కుటుంబంలో ఒకరికి పింఛన్ వస్తోందనే కారణంతో మరో అర్హుడికి పింఛన్ నిలిపివేయడం సరికాదన్నారు. జీవనోపాధి కోసం ట్రాక్టర్, డీసీఎం వంటి వాహనాలు కొనుగోలు చేసిన కుటుంబాల పింఛన్లు తొలగించవద్దని కోరారు. దివ్యాంగులు, వృద్ధుల పింఛన్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. బీడీ, నేత కార్మికులు, దివ్యాంగులు తదితర వర్గాలకు పింఛన్లు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులందరికీ న్యాయం జరిగే వరకు వారి తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానని పేర్కొన్నారు.

చైర్‌పర్సన్ బాలమణి శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డుల్లో అధికారులు నిర్వహించిన సర్వే ఆధారంగా 716 మందికి చేయూత పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇంకా అర్హులైన వారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని, ప్రతి ఒక్కరికీ చేయూత అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ రాజశేఖర్, వైస్ చైర్మన్ బుష్ప పర్వతాలు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# లారీని ఢీకొన్న గడ్డి ట్రాక్టర్.. ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్‌కు అంతరాయం

**జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను పక్కకు తొలగించిన పోలీసులు**

వరంగల్, నవంబర్ 17: వరంగల్ చింతల్ ఫ్లైఓవర్ వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఫ్లైఓవర్‌పై వెళ్తున్న లారీని వెనుక నుంచి గడ్డితో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఆ సమయంలో భారీ వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.ప్రమాదంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వెంటనే స్పందించిన ట్రాఫిక్ పోలీసులు జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను రోడ్డుపై నుంచి పక్కకు తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలు తిరిగి కొనసాగాయి.

# అసమానాలు... సరిహద్దు సైనికుల సేవలు

## నవంబర్ 18...భారత సరిహద్దు సైన్య దినోత్సవం




భారత దేశ ప్రజలు అనుక్షణం ప్రశాంత జీవనం గడుపుతూ సంతోషంగా ఉన్నారంటే కారణం భారత సైనికులు ఇరవై నాలుగు గంటలు సరిహద్దుల్లో దేశానికి కావలా కాస్తూ ఎడారి ఎండల్ని, మంచుకొండల మంచును, నిరంతరం కురిసే వర్షాలను లెక్క చేయకుండా దేశ రక్షణలో ప్రాణ త్యాగానికైనా సిద్ధపడి ఉండడం వల్ల మాత్రమే. కోట్లాది భారతీ యుల కోసం తమ కుటుంబాలకు దూరంగా మంచు కొండల్లో, ఎముకలు కొరికే చలిలో విధులు నిర్వర్తిస్తూ దేశాన్ని కంటికి రెప్పలా కాపలా కాస్తూ, కేవలం దేశరక్షణకే పరిమితం కాకుండా వరదలు, భూకంపాల వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజల రక్షణలోనూ ముందుంటున్న మన సైనికుల రుణాన్ని ఏ విధంగా తీర్చుకోవడం సాధ్యం..

దేశానికి అన్నం పెట్టేది రైతన్న అయితే, దేశాన్ని కాపాడేది సైనికుడు. అందులోనూ త్యాగానికి ప్రతీక సైనికుడు. అందుకే "జై జవాన్, ఆ తరువాత జై కిసాన్" దని అని దేశ మలి ప్రధాని లాల్ బహదూర్ లాంటి పెద్దలు అన్నారు. దేశసేవ కోసం ఎంతో మంది సైనికులు సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్నారు.

సైనికులలో మూడు బృందాలుండేవి. మద్రాస్ శాపర్స్, బెంగాల్ శాపర్స్, బాంబే శాపర్స్ ఉండగా 1932 నవంబర్ 18న వీటిని విలీనం చేశారు. అప్పటి నుంచి వీరి అత్యున్నత సేవలు చరిత్రలో భాగమయ్యాయి. అటు యుద్ధ సమయం లోనూ, ఇటు శాంతి సమయాల లోనూ వీరి సేవలు అసమానంగా సాగుతూ వస్తున్నాయి.

భారతీయ సైన్యం చరిత్ర కొన్ని వేల సంవత్సరాలకు పైబడిందే. మహాభారత కాలాల్లో కురుక్షేత్ర సంగ్రామంలో లక్షలాది మంది యుద్ధంలో పాల్గొన్నారు. రథాలు, గుర్రాలు, ఏనుగులపై నుంచి యుద్ధం సాగించడమే కాకుండా నేలపై నుంచి కూడా యుద్ధం చేసారు. అప్పట్లో విశ్వశాంతి, ధర్మ పరిరక్షణల కోసం అనేక యుద్ధాలు జరిగాయి. క్రమక్రమంగా రాజ్య విస్తరణ కాంక్షతో, నాగరికత పెరిగే కొద్దీ వాయవ్య దిశగా హిందూకుష్ పర్వతాల ద్వారా చొరబాట్లు పెరిగాయి. ఎన్నో శతాబ్దాల పాటు అక్కడ పర్యవేక్షణ లేదు. ఆ తరువాత చొరబాట్లకు అనేక మార్గాలు ఏర్పడ్డాయి. వీటిని ఎదుర్కొనేందుకు ఆయా ప్రదేశాల రాజ్యాధినేతలు యుద్ధాలు చేయాల్సి వచ్చేది. స్వదేశీ తెగల్లోని సైన్యం ప్రధాన ఆయుధాలు విల్లు, బాణాలు. ఆనాటి యుద్ధ కారణాలు పరిమితంగా ఉండేవి. మనుగడ, చొరబాట్లకు సంబంధించినవే ఎక్కువ. భారతీయ రాజకీయ చరిత్రలో చెప్పుకోదగ్గ తొలి చొరబాటు క్రీ.పూ.327 లో అలెగ్జాండర్ అధ్వర్యంలో గ్రీకులది.

ప్రాచీన భారతీయ సాహిత్యంలో రాజకీయాల్లో యుద్ధాల ప్రస్తావనలు ప్రముఖంగా కనిపిస్తాయి చంద్రగుప్త మౌర్యులు కాలంలోని సైన్యాన్ని ఈ సందర్భముగా ప్రస్తావనార్హం. ఆనాటి సైనిక చరిత్రకు అర్థశాస్త్రం ప్రామాణికం లాంటిది. కళింగ రాజుల కాలంలో యుద్ధభూమిలోకి ఏనుగులు వచ్చాయి. ఇవి 17 వ శతాబ్దిదాకా సాగాయి. మౌర్యుల కాలంలో శాంతి స్థాపన జరిగినది. గుప్తుల కాలం లో మన దేశానికి ప్రపంచ గుర్తింపు లభించినది. ఈ విధంగా రాజ్యాల రక్షణ కోసం సైన్యము సైనిక అవసరాలు కలిగాయి.

స్వాతంత్ర్యం సాధించుకున్నాక, స్వతంత్ర రాజ్యమైన కాశ్మీర్ మహారాజు ఇటు భారత దేశంలో లేదా అటు పాకిస్తాన్‌లో విలీనానికి అంగీకరించలేదు. ఈ కారణంగా పాకిస్తాన్ కొంతమంది చొరబాటు దారులను కాశ్మీరుకు పంపి ఊళ్ళను ఆక్రమించుకో సాగింది. మరి కొద్దిరోజులను తన సైన్యాన్ని పంపి కాశ్మీరును ఆక్రమించు కోవడానికి ప్రయత్నిస్తున్నపుడు మహారాజు భారత ప్రభుత్వాన్ని శరణు కోరి భారత దేశంలో కాశ్మీర్‌ను విలీనం చేయడానికి అంగీకరించి ఒప్పందం చేసాడు. అప్పుడు భారత ప్రభుత్వం జనరల్ తిమ్మయ్య నేతృత్వంలో సైన్యాన్ని పంపి పాకిస్తాన్ సైన్యాన్ని కాశ్మీర్ నుండి వెళ్ళగొట్టే చర్యలుచేపట్టింది. ఆ సమయంలో ఐక్యరాజ్య సమితి రెండు దేశాల మధ్య శాంతి చర్చలు ప్రారంభించి సరిహద్దు రేఖను నిర్ణయించడంతో వివాదానికి తెరపడింది.

తర్వాత... బ్రిటీష్, ఫ్రెంచ్ సైన్యాలు భారత దేశాన్ని విడిచి వెళ్ళినా, పోర్చుగీసు సైన్యం విడిచి వెళ్ళక గోవా, డామన్ దయ్యులను తన ఆధీనంలో ఉంచుకుంది. పోర్చుగీస్ అధికారులు చర్చలకు అంగీకరించక పోవడంతో భారత ప్రభుత్వం ఆపరేషన్ విజయ్ పేరుతో సైన్యాన్ని పంపింది. భారత సైన్యాన్ని తట్టుకోలేక పోర్చుగల్ దేశం భారతదేశంతో సంధికి ఒప్పుకొని అన్ని ప్రాంతాలను విడిచి వెళ్ళేందుకు అంగీకరించింది.

చైనాతో 1962లో జరిగిన యుద్ధంలో సైన్యం అంతులేని సాహసాలు ప్రదర్శించారు. కాశ్మీర్ ప్రజలు పాకిస్తాన్ కు మద్దతు ఇస్తారు అన్న అపోహలతో 1965లో పాకిస్తాన్ అధ్యక్షుడు అయ్యూబ్ ఖాన్ తన సైన్యాన్ని పంపి కాశ్మీర్‌ను కొంత మేరకు ఆక్రమించు కున్నాడు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఈ యుద్ధంలోనే అత్యధికంగా యుద్ధ ట్యాంకులను ఉపయోగించారు. భారత ఆర్మీ హోరాహోరీగా పోరాడి అందుబాటులో ఉన్న యుద్ధం ట్యాంకులన్నీ వినియోగించి పాక్ సైన్యానికి తానేమిటో చూపెట్టింది. భారత్ 128 ట్యాంకులను నష్టపోయింది. 150 పాక్ ట్యాంకులను ధ్వంసం చేసి 152 ట్యాంకులను చేజిక్కించుకొంది. తాష్కెంట్‌లో లాల్ బహదూర్ శాస్త్రి - అయూబ్ ఖాన్‌ల మధ్య జరిగిన సంధితో ఈ యుద్ధం ముగిసింది.

1971లో తూర్పు పాకిస్తాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్) లో జరిగిన తిరుగు బాటుతో దాదాపు కోటి మంది శరణార్థులు భారత దేశానికి రావడంతో భారత్-పాక్ యుద్ధం మొదలయింది. తూర్పు పాకిస్తాన్‌కు పశ్చిమ పాకిస్తాన్ నుండి విమోచన కల్పించడం భారత్‌కు అన్ని విధాలా శ్రేయస్కర మయింది. తన బలగాలన్నిటినీ పశ్చిమ పాకిస్తాన్ (ప్రస్తుత పాకిస్తాన్) వైపే గురి పెట్టగలిగింది. భారత సైన్యం జనరల్ అరోరా నేతృత్వంలో పాక్ సైన్యాన్ని లాహోర్ వరకు తరిమి కొట్టి 90వేల యుద్ధ ఖైదీలను పట్టుకొంది. పాక్ ఓటమిని అంగీకరించడంతో ఈ యుద్ధం ముగిసింది.

1999లో పాకిస్తాన్ తన సైన్యాన్ని పంపి తీవ్రవాదులతో కలసి ఆ ప్రాంతాలు ఆక్రమించుకుంది. నెమ్మదిగా కీలకమయిన బటాలిక్, ద్రాస్, టైగర్ హిల్‌లను ఆక్రమించు కోవడంతో భారత్ 2లక్షల మంది సైన్యాన్ని సిద్ధం చేసింది. కార్గిల్ యుద్ధం జరుగుతున్న ప్రాంతాల కున్న పరిమితులవల్ల 30వేల మంది మాత్రమే పాల్గొన్నారు. సైన్యం అనేక కీలక పర్వతాలలో, చెక్ పోస్టుల వద్ద ఉన్న తీవ్రవాదులను సమర్థవంతంగా ఎదుర్కొని రెండు నెలల్లో అన్నింటినీ స్వాధీనం చేసుకుంది. ఇలా భారత సరిహద్దు లలో సైన్యం అంతులేని ధైర్య సాహసాలు ప్రదర్శిస్తు, సకల త్యాగాలకు సిద్ధపడి, ప్రాణాలను పణంగా పెట్టి అనుక్షణ అప్రమత్తులై దేశ రక్షణ చేస్తున్నారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# ఘనంగా సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల ముగింపు



అమరావతి, నవంబర్ 17: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శతవర్ష జన్మదినోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా దేశవ్యాప్తంగా పర్యటించిన ఐదు ప్రేమ ప్రవాహిని రథాలు ఆయనతో ప్రత్యేక అనుబంధం ఉన్న అనంతపురం జిల్లా ఉరవకొండకు చేరుకున్నాయి. గత 18 నెలలుగా దేశంలోని దక్షిణ, పశ్చిమ, ఉత్తర, ఈశాన్య, తూర్పు ప్రాంతాల మీదుగా సుమారు లక్ష కిలోమీటర్లు ప్రయాణించిన ఈ రథాలు ఆసేతు హిమాచలం పర్యటనను పూర్తి చేసుకుని ఉరవకొండకు చేరుకోవడంతో భక్తుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

భగవాన్ శ్రీ సత్యసాయిబాబా తాను షిరిడీ సాయి అవతారమని ప్రకటించిన పుణ్యక్షేత్రంగా ఉరవకొండకు ప్రత్యేక గుర్తింపు ఉంది. మంగళవారం ఐదు రథాలతో పాటు, 1940 అక్టోబరు 20న స్వామివారు 'మానస భజరే గురు చరణం' భజన ఆలపించిన అబ్కారీ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తోటలోని రాతిశిలపై నిర్మించిన బాలసాయి శిలా మందిరం వద్ద వెలిగించిన జ్యోతిని కలిగిన ప్రత్యేక రథం కూడా పర్యటనలో పాల్గొంది. ఈ రథాలన్నీ అనంతపురం, ధర్మవరం మీదుగా పుట్టపర్తికి చేరుకోనున్నాయి.

ఈ కార్యక్రమానికి అఖిల భారత సత్యసాయి సేవా సమితుల అధ్యక్షుడు నిమిష్ పాండ్యా, జాతీయ సేవా సమన్వయకర్త కోటేశ్వరరావు, దక్షిణ భారత జోన్ అధ్యక్షుడు వెంకటరమణ గోసావి, జాతీయ యువ సమన్వయకర్త లక్ష్మీకాంత్, ఆంధ్ర రాష్ట్ర సేవా సమితుల అధ్యక్షుడు లక్ష్మణరావు, కర్ణాటక సేవా సమితుల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

బాలసాయి శిలా మందిరం వద్ద ఉన్న రాతిశిలకు రుద్రాభిషేకం, అర్చన నిర్వహించారు. వేదపఠనం, భజన కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. స్వామివారితో ముడిపడిన చారిత్రక ప్రదేశంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం కార్యక్రమంలో విశేషంగా నిలిచింది.

ఉదయం 7.30 గంటలకు స్వామివారు చదువుకున్న శ్రీ కరిబసవ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఒక రథంతో నగర సంకీర్తన ప్రారంభమైంది. పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సాగిన ఈ కార్యక్రమం సుంకులమ్మ గుడి, సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, స్వామివారు నివసించిన గృహం మీదుగా క్లాక్ టవర్ వరకు కొనసాగింది.

అనంతరం స్వామివారు చదువుకున్న తరగతి గదిలో నూతనంగా నిర్మించిన పూజా మందిరాన్ని ముఖ్య అతిథులు ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా కరిబసవ ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాల, బాలుర జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

ఉరవకొండ పట్టణంలోని వై జంక్షన్ నుంచి ఐదు ప్రేమ ప్రవాహిని రథాలతో పాటు జ్యోతి కలిగిన ప్రత్యేక రథాన్ని అఖిల భారత అధ్యక్షుడు, ఇతర ప్రముఖులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి నమన్వయకర్తలు, జిల్లా స్థాయి సమన్వయకర్తలు, జిల్లాలోని వివిధ సత్యసాయి సేవా సమితుల కన్వీనర్లు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

విశ్వశాంతి, పరస్పర సౌహార్దం, ప్రేమాభిమానాల ప్రాధాన్యాన్ని చాటిచెప్పడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. సత్యసాయిబాబా సందేశాలను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పే ఈ కార్యక్రమాన్ని 126 దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం చేశారు.

# చిన్నారుల ఎదుగుదలపై ప్రత్యేక పర్యవేక్షణ

### అంగన్‌వాడీల్లో పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి - కలెక్టర్ గరిమ అగ్రవాల్




రాజన్న సిరిసిల్ల,నవంబర్ 17: (నేటినిజం ప్రతినిధి): చిన్నారుల ఆరోగ్యకర ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. ఆరేళ్లలోపు పిల్లలను ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. మంగళవారం ముస్తాబాద్‌లో నిర్వహించిన 'ప్రతి మంగళవారం 10 నిమిషాలు' కార్యక్రమంలో ఆమె పాల్గొని చిన్నారుల ఎత్తు, బరువును పరిశీలించారు. సామ్, మామ్ పిల్లల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరాన్ని పరిశీలించి, పిల్లల పెరుగుదల పర్యవేక్షణ కార్డులను ఆవిష్కరించారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

### ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి
### క్రమశిక్షణతో ఉత్తమ వైద్యులుగా ఎదగాలి
### విద్యార్థులకు ఎస్పీ మహేష్ గితే




రాజన్న సిరిసిల్ల, నవంబర్ 17: డిజిటల్ యుగంలో విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. సోషల్ మీడియా, ఆన్‌లైన్ వేదికలను వినియోగించే సమయంలో వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, కుటుంబ వివరాలు, ఓటీపీలు, బ్యాంకింగ్ సమాచారం అవరిచితులతో పంచుకోవద్దని హెచ్చరించారు. నకిలీ ఉద్యోగ ప్రకటనలు, బహుమతుల ఆశలు, ఫేక్ సోషల్ మీడియా ఖాతాలు, ఆన్‌లైన్ గేమింగ్, డిజిటల్ అరెస్ట్ వంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.మంగళవారం జిల్లా పరిధిలోని మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. అనుమానాస్పద లింక్‌లు, తెలియని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు, సందేశాలకు స్పందించవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మొబైల్ ఫోన్‌ను చెడు వ్యసనాలకు కాకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఉపయోగించుకోవాలని హితవు పలికారు.వైద్య విద్యార్థులు ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సీనియర్లు, జూనియర్లు పరస్పర గౌరవంతో స్నేహపూర్వక వాతావరణంలో విద్యను అభ్యసించాలని ఎస్పీ పేర్కొన్నారు. మత్తు పదార్థాల వినియోగం విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కష్టపడి చదివి ఉత్తమ వైద్యులుగా ఎదిగి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.కళాశాల యాజమాన్యం విద్యార్థుల ప్రవర్తనను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. బాధిత విద్యార్థులు కళాశాలలోని యాంటీ ర్యాగింగ్ కమిటీకి వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థినుల భద్రత కోసం షీ టీమ్స్ అందుబాటులో ఉన్నాయని, వేధింపులు ఎదురైతే 87126 56425 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. అనంతరం వైద్య విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాల దుష్పరిణామాలపై ప్రదర్శించిన స్కిట్ ద్వారా తోటి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, అధ్యాపకులు, సైబర్ ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# 33 ఏళ్లుగా నరకయాతన..

### నక్సల్స్ తూటాలు ఇంకా శరీరంలోనే!
### కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం, జీవితాంతం మందులు ఇప్పించాలి
### కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి వినతి



కరీంనగర్, నవంబర్ 17: (నేటినిజం ప్రతినిధి) సందర్భంగా శ్రీనివాసరెడ్డి తన బాధలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. 33 ఏళ్ల క్రితం సర్పంచ్‌గా ఉన్న సమయంలో పోలీసులకు సమాచారం అందిస్తున్నాననే కారణంతో నక్సల్స్ తనను పట్టుకుని చేతులు కట్టేసి చిత్రహింసలకు గురిచేశారని, అనంతరం కాల్పులు జరిపారని తెలిపారు. ఈ ఘటనలో నడుము విరిగి, నడుము కింది భాగం స్పర్శ కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. నక్సల్స్ కాల్పుల్లో తగిలిన బుల్లెట్ ఇప్పటికీ శరీరంలోనే ఉందని, మలమూత్ర విసర్జన కూడా చేసుకోలేని దుస్థితిలో జీవిస్తున్నానని కన్నీటిపర్యంతమయ్యారు.గత 33 ఏళ్లుగా చావలేక బతుకుతున్నానని, వైద్యుల సూచన మేరకు జీవితాంతం మందులు వాడాల్సి వస్తోందని తెలిపారు. ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారడంతో వైద్య ఖర్చులు భరించలేకపోతున్నానని వాపోయారు. ఎంఎస్సీ, బీఈడీ పూర్తి చేసిన తన కుమార్తెకు ప్రభుత్వం ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించాలని, తాను జీవించి ఉన్నంతకాలం అవసరమైన మందులు అందేలా చూడాలని కేంద్ర మంత్రిని వేడుకున్నారు. శ్రీనివాసరెడ్డి పరిస్థితిని తెలుసుకున్న బండి సంజయ్ సానుకూలంగా స్పందించారు. ఆయన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు

# పండుగ సీజన్‌లో వ్యక్తిగత రుణాల జోరు

### ఏపీలో 50 శాతం, తెలంగాణలో 38 శాతం వృద్ధి
### దేశవ్యాప్తంగా రుణాల పంపిణీ 32 శాతం పెరుగుదల: పైసాబజార్

హైదరాబాద్, నవంబర్ 17: పండుగ సీజన్‌లో తక్షణ వ్యక్తిగత రుణాల పంపిణీ గణనీయంగా పెరిగినట్లు ప్రముఖ ఆర్థిక సేవల వేదిక పైసాబజార్ వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో 50 శాతం, తెలంగాణలో 38 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా రుణాల పంపిణీ 32 శాతం పెరిగిందని పేర్కొంది. మొత్తం రుణాల పంపిణీలో మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల వాటా మూడింట ఒక వంతుకు పైగా ఉన్నట్లు వెల్లడించింది.

2025, 2026 సంవత్సరాల్లో అక్టోబర్ నెలలోనే అత్యధికంగా రుణాల పంపిణీ జరిగినట్లు సంస్థ తెలిపింది. ముఖ్యంగా 46 నుంచి 55 ఏళ్ల వయసు వారిలో రుణాల పంపిణీ 70 శాతం పెరిగింది. మొత్తం రుణాల్లో 36 నుంచి 45 ఏళ్ల వయసు వారు 40 శాతం వాటాతో అగ్రస్థానంలో నిలిచారు. 25 నుంచి 35 ఏళ్ల వయసు వారు 36 శాతం వాటాతో రెండో స్థానంలో ఉన్నారు. దేశవ్యాప్తంగా 800కు పైగా పట్టణాలు, నగరాల్లో ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు నమోదైన గణాంకాలను విశ్లేషించినట్లు సంస్థ పేర్కొంది.

ఈ సందర్భంగా పైసాబజార్ సీఈఓ సంతోష్ అగర్వాల్ మాట్లాడుతూ, డిజిటల్ వేదికల ద్వారా రుణాలు పొందడం సులభతరం కావడంతో వినియోగదారుల ఆదరణ పెరుగుతోందన్నారు. ప్రస్తుతం 18 రుణ భాగస్వామ్య సంస్థల ద్వారా తక్షణ వ్యక్తిగత రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వినియోగదారులు పూర్తిస్థాయి డిజిటల్ ప్రక్రియ ద్వారా రూ.7 లక్షల వరకు రుణాలు పొందవచ్చన్నారు. రుణదాత ఆమోదం, అవసరమైన ప్రక్రియ పూర్తయితే కేవలం రెండు గంటల్లోనే రుణ మొత్తం అందే అవకాశం ఉందని వివరించారు.

## ఎమ్మెల్యే నివాసం వద్ద బీఆర్ఎస్-కాంగ్రెస్ బాహాబాహీ!

ఖమ్మం, నవంబర్ 17: కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ నివాసం వద్ద మంగళవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఎమ్మెల్యే నివాసం ముట్టడికి కాంగ్రెస్ నాయకులు పిలుపునివ్వడంతో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నాయి.ముట్టడికి ప్రయత్నిస్తే అడ్డుకుంటామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించడంతో ఇరు పార్టీల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో నాయకులు, కార్యకర్తల మధ్య తోపులాట జరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.